


# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక




సంపుటి: 4 సంచిక: 53, పేజీలు - 08

శుక్రవారం, జూన్ 21, 2023 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

## ఇక రైతు భరోసా అందరికీ రాదు

**- ప్రభుత్వం సన్నాహాలు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రైతు భరోసా (బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు) పథకానికి సీలింగ్ విధించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. ఐదు లేదా 10 ఎకరాల భూమి ఉన్న వారికే పంట పెట్టుబడి సాయాన్ని అందించాలని రేవంత్ సర్కార్ యోచిస్తోంది. త్వరలోనే దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. రైతులకు ఎంత భూమి ఉన్నా సరే పెట్టుబడి సాయాన్ని మాత్రం ఐదు లేదా 10 ఎకరాల వరకే అందించే దిశగా సర్కార్ చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది.


6లో ▶

## పాడైపోయిన మటన్‌తో బిర్యానీ

8లో ▶

## కాంగ్రెస్‌లో కేబినెట్ విస్తరణ
# సందడి

**- నాలుగైదు పదవులు భర్తీ చేసే అవకాశం**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మంత్రి పదవుల హడావుడి కనిపిస్తోంది. రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో ప్రస్తుతం పన్నెండు మంది మాత్రమే ఉన్నారు. మరో ఆరుగురికి అవకాశం ఉంది.

పార్లమెంట్ ఎన్నికలు అయిపోయిన తరవాత విస్తరణ చేపట్టాలని అనుకున్నారు. పార్లమెంట్ ఎన్నికలు ముగియడంతో విస్తరణపై దృష్టి పెట్టారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే కాంగ్రెస్ హైకమాండ్‌తో మంతనాలు జరిపారని గ్రీన్ సిగ్నల్ వచ్చినట్టు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

### అసెంబ్లీ సమావేశం కంటే ముందే మంత్రివర్గ విస్తరణ

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల కంటే ముందే విస్తరణ ఉండే అవకాశం ఉంది.

రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో కొన్ని జిల్లాలకు ఎక్కువ ప్రాతినిధ్యం దక్కగా, కొన్ని జిల్లాలకు అసలు చోటు లేదు. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు సంబంధించిన నేతలెవ్వరూ లేరు. ఎమ్మెల్యేలు గెలవకపోవడమే దీనికి కారణం. ఈసారి ఆయా జిల్లాలకు ఛాన్స్ ఇవ్వాలని అనకుంటున్నారు.

లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ముదిరాజ్‌లకు ప్రాతినిధ్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు కాంగ్రెస్ పెద్దలు. వారిలో ముక్తల్ నుంచి శ్రీహరికి రావచ్చని అంటున్నారు. రాజగోపాల్ రెడ్డి, గడ్డం వివేక్, ప్రేమసాగర్, సుదర్శన్‌రెడ్డి, మైనార్టీల నుంచి ఒకరు పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఒక స్థానాన్ని ఖాళీగా ఉంచాలని రేవంత్ అనుకుంటున్నారు.

### మంత్రి పదవుల కోసం భారీ పోటీ

పలువురు నేతలు మంత్రి వర్గంలో స్థానంలో కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. హైకమాండ్ వద్ద లాబీయింగ్ చేసుకుంటున్నారు. మరో వైపు పార్టీలో చేరిన వారికీ చాన్స్ వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరూ పెద్దగా విజయం సాధించలేదు. దీంతో పార్టీలో చేరిన వారికి చాన్స్ ఇస్తారని అంటున్నారు. సికింద్రాబాద్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన దానం నాగేందర్ పేరును పరిశీలిస్తున్నారు. అయితే ఓ పార్టీ తరపున గెలిచిన ఎమ్మెల్యేను మరో పార్టీ ప్రభుత్వంలో ప్రమాణం చేయించేందుకు గవర్నర్ అంగీకరిస్తారా అన్న సందేహాలు ఉన్నాయి.

### స్థానికసంస్థల ఎన్నికల నిర్వహణపై కసరత్తు

స్థానిక సంస్థల ఎన్నికలను అసెంబ్లీ బడ్జెట్ తర్వాత నిర్వహించాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఇప్పటికే స్థానిక సంస్థల పదవీ కాలం ముగిసింది. ప్రత్యేకాధికారుల పాలనలో స్థానిక సంస్థలు ఉన్నాయి.

ఈ ఎన్నికలు పూర్తి చేస్తే ఇక పూర్తి స్థాయిలో పాలనపై దృష్టి పెట్టవచ్చని రేవంత్ రెడ్డి అనుకుంటున్నారు. అయితే మంత్రి పదవుల భర్తీ పెను సవాల్ గా మారనుంది. సీనియర్లు అసంతృప్తికి గురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## రష్యా ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపిన మోదీ పేపర్ లీకేజీని ఆపలేకపోతున్నారు

**- విద్యాసంస్థల స్వతంత్ర ప్రతిపత్తిని బీజేపీ ప్రభుత్వం దెబ్బతీస్తోందన్న రాహుల్**

**- విద్యాసంస్థలను బీజేపీ మాతృసంస్థ తన గుప్పెట్లో పెట్టుకుందని ఆరోపణ**

**- నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** నీట్ వివాదంపై రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. ఈ ఎగ్జామ్‌ని రద్దు చేయడంపైనా అసహనం వ్యక్తం చేశారు. భారత్ జోడో యాత్రలో వేలాది మంది విద్యార్థులు పేపర్ లీక్‌లపై తనతో చర్చించారని గుర్తు చేశారు. విద్యాసంస్థలతో పాటు మొత్తం వ్యవస్థను బీజేపీ తన చేతుల్లోనే పెట్టుకుందని, అందుకే ఇలాంటివి జరుగుతున్నాయని విమర్శించారు. రష్యా ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపిన మోదీ పేపర్ లీక్‌లను ఆపలేకపోయారని చురకలు అంటించారు. ఆర్ఎస్ఎస్ కి చెందిన వాళ్లనే ఏరికోరి విద్యాసంస్థల్లో వైస్ ఛాన్సలర్‌లుగా నియమిస్తున్నారని మండి పడ్డారు. బీజేపీ పూర్తిగా విద్యావ్యవస్థను ధ్వంసం చేసిందని ఆరోపించారు. పెద్ద నోట్ల రద్దుతో ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీసినట్టే ఇప్పుడు విద్యావ్యవస్థనీ ఇలాగే నాశనం చేస్తున్నారని విమర్శించారు. నీట్ పేపర్ లీక్‌లో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యావ్యవస్థ ఇంత గందరగోళంగా మారడానికి కారణం ఆర్ఎస్ఎస్. ఈ పరిస్థితి మారనంత వరకూ ఇలా పేపర్ లీక్‌లు జరుగుతూనే ఉంటాయి. మోదీ విద్యాసంస్థల్ని తన చెప్పుచేతల్లో పెట్టుకున్నారు. దాదాపు

8లో ▶

## ఏపీ అంటే
# అమరావతి పోలవరం

**- ముఖ్యమంత్రి హోదాలో అమరావతిలో పర్యటించిన చంద్రబాబు**

**- పలు ప్రాంతాలను సందర్శించి ఆవేదన వ్యక్తం చేసిన వైనం**

**- వైసీపీ ప్రభుత్వం ప్రజల ఆశలను చిదిమివేసిందని వ్యాఖ్య**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీ అంటే అమరావతి, పోలవరం అని రాజధాని అంటే ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కాదని సీఎం చంద్రబాబు అన్నారు. గురువారం అమరావతి నిర్మాణాల పరిశీలన అనంతరం సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరూ ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లకుండా ఉండాలనే ఉద్దేశంతోనే అమరావతిలో రాజధాని నిర్మాణం చేపట్టామని చెప్పారు. పోలవరం పూర్తైతే రాష్ట్రం మొత్తానికి నీరు వస్తుందనే ఉద్దేశంతో దానిని పూర్తి చేసేందుకు ప్రాధాన్యత ఇచ్చాం. అందుకోసం విభజన చట్టం తోడ్పాటు తీసుకున్నాం. రాజధాని అమరావతి ఆంధ్రప్రదేశ్ ప్రజలందరి చిరునామా. ఆ తర్వాత ఐదేళ్లు రాష్ట్రంలో విధ్వంస పాలన చూశాం. రాజకీయాలకు పనికిరాని, అర్హత లేని వ్యక్తి సీఎం అయితే ఎలా ఉంటుందో గత ఐదేళ్లలో ప్రత్యక్షంగా చూశాం. అందుకే జగన్ లాంటి ముఖ్యమంత్రి మనకు అవసరం లేదని ప్రజలు తిప్పికొట్టారు. ఇటీవల ఎన్నికల్లో కూటమికి కనివినీ ఎరుగని విజయాన్ని కట్టబెట్టారు. వైసీపీ 11 సీట్లకే పరిమితమైంది. వైసీపీ హయాంలో అమరావతి రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. 1631 రోజులు ఆందోళన

8లో ▶

## 16 సీట్లతో టీడీపీ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపగలిగింది

**- కేటీఆర్ కీలక వ్యాఖ్యలు**

**- బీఆర్ఎస్ 16 ఎంపీ సీట్లు గెలిచి ఏం చేస్తుందని రేవంత్ రెడ్డి ప్రశ్నించారన్న కేటీఆర్**

**- బీఆర్ఎస్ అత్యధిక సీట్లు గెలిస్తే కేంద్రంలో నిర్ణయాత్మక స్థానంలో ఉండేదని వెల్లడి**

**- బొగ్గు గనులను వేలం లేకుండా కేటాయించాలని డిమాండ్**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బీఆర్ఎస్‌కు పదహారు సీట్లు వస్తే ఏం చేసుకుంటారని సీఎం రేవంత్ రెడ్డి లోక్ సభ ఎన్నికల సమయంలో మాట్లాడారని ఇప్పుడు ఏపీలో టీడీపీ పార్టీకి 16ఎంపీ సీట్లు వచ్చాయని వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా ఆపగలిగిందని అన్నారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన కేటీఆర్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, సింగరేణి పై కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ పార్టీ ఒక రక్షణ కవచం, శ్రీరామరక్ష అని కేసీఆర్ ఈ 25 ఏండ్లలో ఒక్కసారి కాదు వేల సార్లు చెప్పారని గుర్తు చేశారు. కానీ ఇవాళ ఏం జరిగిందని ప్రశ్నించారు. కేసీఆర్ 16 పార్లమెంట్ సీట్లు ఇవ్వండి అని మొత్తుకున్నారు కేంద్రంలో నిర్ణయాత్మక పాత్రలో ఉంటామని చెప్పారు. 16 ఎంపీలతో ఏం చేస్తారని సీఎం రేవంత్ రెడ్డితో సహా చాలా మంది చాలా మాట్లాడారన్నారు. కానీ ఇవాళ ఏపీలో 16 ఎంపీ సీట్లు గెలిచిన తెలుగు దేశం పార్టీ నిర్ణయాత్మక పాత్రలో ఉంది. వైజాగ్ స్టీల్ ప్లాంట్

8లో ▶

## రివ్యూల్లో పవన్ కల్యాణ్
# ప్రత్యేకతే వేరు

**- తొలి సమీక్షలోనే తేల్చేసిన జనసేనాని**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** తనకు కేటాయించిన పద వులను గౌరవంగా భావించి బాధ్యతగా పనిచేస్తానని డిప్యూటీ సీఎం పవన్ తెలిపారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి ఆయన ఇన్‌స్టా వేదికగా స్పందించారు. ఏపీ ఉపముఖ్యమంత్రిగా మంత్రిగా బాధ్యతలు చేపట్టడం గౌరవంగా భావిస్తానని, తనకు అప్పగించిన బాధ్యతలతో రాష్ట్ర ప్రజలందరికీ సుస్థిర భవిష్యత్తు అందించేందుకు కృషి చేస్తానని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన సామాజిక మాధ్యమ వేదికగా తొలిసారి తన భావాలను పంచుకున్నారు. “ఏపీ ఉపముఖ్యమంత్రిగా, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, పర్యావరణం, అటవీ, శాస్త్ర, సాంకేతిక శాఖల మంత్రిగా బాధ్యతలు తీసుకోవడం గౌరవంగా ఉంది. దీనితో నా బాధ్యత పెరిగింది. రాష్ట్రానికి అంకిత భావంతో, సమగ్రతతో సేవచేయడానికి కట్టుబడి ఉన్నా. సుసంపన్నమైన, సుస్థిరమైన భవిష్యత్తు అందరికీ అందించడంలో నా వంతు పాత్ర పోషించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నా” అని ఇన్‌స్టాగ్రామ్ లో ఆయన పోస్ట్ చేశారు. తొలిరోజు మాదిరే రెండోరోజు సైతం పవన్ కల్యాణ్ తన శాఖలపై రివ్యూలు నిర్వహించారు.

8లో ▶

## న్యాయంగా, ధర్మంగా చూస్తే
# మనం ఓడిపోలేదు

- వైసీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించిన జగన్
- రాజకీయ దాడుల్లో గాయపడిన కార్యకర్తలకు పరామర్శ
- నేతలకు, కార్యకర్తలకు దిశానిర్దేశం
- ఎంతో మంచి చేసినా ఎన్నికల ఫలితాలు ఆశ్చర్యానికి గురిచేశాయని వ్యాఖ్యలు
- శకుని పాచికల మాదిరి ఎన్నికల ఫలితాలు వచ్చాయని వెల్లడ



**తాడేపల్లి (ప్రశ్న న్యూస్)** వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ మళ్లీ ఓదార్పు యాత్ర చేపట్టనున్నారు. గురువారం తాడేపల్లిలో జరిగిన వైసీపీ విస్తృత స్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల అనంతరం జరిగిన రాజకీయ దాడుల్లో గాయపడ్డవారిని ఆయన పరామర్శించనున్నారు. ఈ సమావేశంలో పోటీ చేసిన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు, గెలిచిన ఎమ్మెల్యేలు హాజరయ్యారు. అలాగే, వైసీపీ ఓటమితో కుంగిపోయి మృతి చెందిన

8లో ▶

## హరీష్ రావుపై ఈడి నజర్.?

**- ముగ్గురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై కేసులకు రంగం సిద్ధమా.?**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** పటాన్‌చెరులో జరిగిన మైనింగ్‌లో రూ.300 కోట్ల కుంభకోణం జరిగిందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, అప్పటి జిల్లా మంత్రి, ప్రస్తుత సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు, అప్పటి ఎంపీ, ప్రస్తుత దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో అక్రమ మైనింగ్, క్రషర్ వ్యాపారం సాగిస్తున్నారని ఆరోపించారు. సంతోష్ ఇసుక, గ్రానైట్ సరఫరా కంపెనీకి వ్యతిరేకంగా టిఎస్ పిసిబి 10.03.2023 తేదీతో మూసివేత ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం లక్డారం గ్రామంలోని సర్వే నంబర్ 738లోని ప్రభుత్వ అసైన్డ్ భూమిలో అక్రమ మైనింగ్‌ను కొనసాగించినట్లు ఫిర్యాదుదారుడు రవివట్టెం తెలిపారు.ఈ కేసుకు సంబంధించిన పూర్తి ఆధారాలు పరిశీలనలో ఉన్నాయని ఈడి ధృవీకరించింది. నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమ మైనింగ్ చేసిన అధికారులపై ప్రజాప్రతినిధులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అందులో భాగంగా త్వరలో మాజీ మంత్రి హరీష్ రావుకు కొత్త ప్రభాకర్ రెడ్డికి నోటీసులు జారీ చేసి కేసు నమోదు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి

## సింగరేణిని కాపాడుకోవడానికి
# అవసరమైతే మోదీని కలుస్తాం

**- బీఆర్ఎస్, బీజేపీలపై భట్టి ఫైర్**



**- బీఆర్ఎస్, బీజేపీ నేతల మాటలు రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతమని వ్యాఖ్య**

**- బీఆర్ఎస్ నేతల తీరు దొంగే దొంగ అన్నట్లుగా ఉందని మండిపాటు**

**- సింగరేణి తెలంగాణకే తలమానికమన్న భట్టివిక్రమార్క**

8లో ▶

## లిక్కర్ లిక్కర్ కేసులో కేజ్రీవాల్‌కు బెయిల్

**- బెయిల్ పిటిషన్‌పై ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం**

**- వాదనలు వినిపించిన ఈడీ, సీఎం తరపు న్యాయవాదులు**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ నేషనల్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు బెయిల్ దొరికింది. రూ.1 లక్ష పూచీకత్తుతో కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేస్తున్నట్లు ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు తాజాగా తీర్పును ఇచ్చింది. ఇటీవల

8లో ▶

# పోలీస్ వ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్న ఎమ్మెల్యే కుటుంబం.

- ముడుపులు తీసుకుని పోస్టింగ్‌లు ఇస్తున్న మంత్రి సోదరుడు
- ప్రసిద్ధ పుణ్య క్షేత్రానికి మాయని మచ్చగా ఎస్ఐ వ్యవహారం
- తమ కనుసన్నల్లో పని చేసేవారికే ఇక్కడికి ట్రాన్స్ఫర్‌లు
- కాళేశ్వరం ఎస్ఐ దురాఘాతానికి మంత్రి బాధ్యత వహించాలే
- ప్రెస్‌మీట్‌లో జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్



**మంథని (ప్రశ్న న్యూస్)** మంథని పట్టణంలోని రాజగృహాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఎమ్మెల్యే మంత్రి తండ్రి ఆనాడు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎస్పీని తన మాట వినలేదని ఇక్కడి నుంచి మరోచోటికి ట్రాన్స్ఫర్ చేయించారని అన్నారు. తమ మాట వింటూ కాంగ్రెస్ కండువా కప్పుకునే పోలీస్ అధికారులకు మాత్రమే ఇక్కడ పోస్టింగ్‌లు ఇచ్చే వారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మంథని నియోజకవర్గంలోని మహాదేవ్‌పూర్ మండలం కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ పోస్టింగ్‌కు మంత్రి సోదరుడు ముడుపులు తీసుకుని ప్రస్తుత ఎస్ఐకి పోస్టింగ్ ఇప్పించారని అన్నారు. ఇలా ఎమ్మెల్యే సోదరుడు తమకు నచ్చిన వారికి ఇక్కడ పోస్టింగ్‌లు ఇప్పించి తనపై కుట్రలు చేస్తున్నారని, గతంలో ఇక్కడ పని చేసిన సీఐకి ఏసీపీగా పోస్టింగ్ ఇచ్చారని గుర్తు చేశారు. రాష్ట్రంలోనే ప్రఖ్యాతిగాంచిన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి సన్నిదిలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ ఓ మహిళాకానిస్టేబుల్‌పై అఘాయిత్యానికి పాల్పడటం ప్రతి ఒక్కరు ఖండించాలని, ఈ వ్యవహారం కాళేశ్వర క్షేత్రానికే మాయని మచ్చగా మిగిలిపోతుందన్నారు. గతంలో ఆసిఫాబాద్ జిల్లాలో ఎస్ఐ వ్యవహారంపై తమ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకనే సదరు ఎస్ఐకి కాళేశ్వరంలో పోస్టింగ్ ఇప్పించారన్నారు. కాళేశ్వరం ఎస్ఐ మంత్రి సోదరుడికి సన్నిహితుడని పదేపదే చెప్పేవాడని, వారి అండదండలతోనే అఘాయిత్యాలు, ఆరాచకాలకు పాల్పడ్డాడని అన్నారు. నియోజకవర్గంలోని పోలీస్ స్టేషన్‌లు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలుగా మారుతున్నాయని, ఇటీవల మహాదేవ పూర్ పోలీస్‌స్టేషన్‌లోనే కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ జెడ్పీటీసీ భర్త డాన్స్‌లు చేయడం ఇందుకు నిదర్శనమన్నారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఏ గోలపు శంకర్ గౌడ్, వైస్ ఎంపీపీ వేల్పుల గట్టయ్య, బత్తుల సత్యనారాయణ, శఘ్యం రాజేష్, కౌన్సిలర్లు సమ్మయ్య, గ్రెపల్లి సత్యనారాయణ, ఇర్ఫాన్, ఆసిఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు

# మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా మాదిగల జె ఎ సి జనసభ కరపత్రం ఆవిష్కరణ

**జిల్లా అధ్యక్షులు అక్కపాక సంపత్**



**మంథని (ప్రశ్న న్యూస్ )** మంథని రెవెన్యూ డివిజన్ పరిధిలోని మాదిగల జనాభా ఎక్కువ శాతం ఉన్నందున వారి లెక్కల ప్రకారంఈ రాష్ట్రంలోమాదిగ జేఏసీ ఆధ్వర్యంలోమాదిగల అందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని జనసభ కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని మాదిగలకు జిల్లా అధ్యక్షులు అక్కపాక సంపత్ కుమార్ మాదిగలందరూ ఒక్కతాటి మీదకి రావడానికి ఈ సభను నిర్వహిస్తున్నామని . ఈ రిజర్వేషన్తో మాదిగల పిల్లలకు సరైన న్యాయం జరుగుతుందని మేము కోరుకుంటున్నాము ప్రతి ఒక్కరూ పాల్గొని మాదిగల సభను విజయవంతం చేయగలరని పిలుపునిస్తున్నాము ఈ నెల 24 తారీఖున మాదిగ జే ఏ సి ఆధ్వర్యంలో జరుగబోయే మాదిగలకు జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో మాదిగలకు 12శాతం రిజ్వేషన్లను కల్పించాలనే డిమాండ్ తో జరుగబోయే మాదిగ జనసభ కరపత్రాలను మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాదిగ జే ఏ సి జిల్లా అధ్యక్షులు అక్కపాక సంపత్ కుమార్, మాదిగ జే ఏ సి డివిజన్ అధ్యక్షులు బూడిద శంకర్,ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షులు మంథని సత్యం, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మంథని రాకేష్, కాశిపేట బాపు, రాజేశ్వర్ రావు, వేల్పుల రాజు, కరునకృష్ణ, అక్కపాక సది, జానీ,పోయిల సుమన్, కలవల రాజేశం నాయకులు పాల్గొన్నారు.

# 100 క్వింటాల అక్రమ రేషన్ బియ్యం పట్టివేత.

**జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్**



**మంథని ( ప్రశ్న న్యూస్)** పెద్దపెల్లి జిల్లా ధర్మారం మండలంలోని నరసింహులు పల్లె గ్రామం వద్ద పౌర సరఫరాల శాఖ టాస్క్ ఫోర్స్ బృందం నిర్వహించిన ఆకస్మిక తనిఖీలలో 100 క్వింటాళ్ల అక్రమ రేషన్ బియ్యం నిల్వలు పట్టుకోవడం పట్టుకున్నారు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్ తెలిపారు.గురువారం జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్ ధర్మారం మండలంలోని నరసింహులపల్లి గ్రామం ఎల్లమ్మ దేవాలయం వద్ద ఉన్న ఓపెన్ ఏరియా నందు ఎన్ఫోర్స్మెంట్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మాట్లాడుత ఎల్లమ్మ దేవాలయం వద్ద ఉన్న ఓపెన్ ఏరియాలో దాదాపు 100 క్వింటాళ్ల రేషన్ బియ్యం డంప్ ను గుర్తించామని, ఈ బియ్యాన్ని ఎవరు క్లెయిమ్ చేయడం లేదని, పంచనామా నిర్వహించి జిల్లా కలెక్టర్కు తదుపరి ఆదేశాల వరకు ఎం.ఎల్.ఎస్ పాయింట్ వద్ద ఈ బియ్యాన్ని భద్రపరచడం జరుగుతుందని అన్నారు. ఈ తనిఖీలలో సంబంధిత అధికారులు, జిల్లా పౌర సరఫరాల అధికారి వెంట తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపెల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ చేసినటువంటి ఆరోపణలను

పాత్రికేయ సమావేశంలో తీవ్రంగా ఖండించిన

మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు

మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఐలి ప్రసాద్, మాట్లాడుతూ



**మంథని (ప్రశ్న న్యూస్)** మంథని నియోజకవర్గ పరిధిలోని కాలేశ్వరం ఎస్సై పై పుట్ట మధు చేసినటువంటి ఆరోపణలు దమ్ముంటే నిరూపించాలని లేదంటే రాజకీయ సన్యాసం తీసుకోవాలని సవాలు విసిరారు. కాలేశ్వరం ఎస్సై భవాని సేన్ లైంగిక దాడిని పుట్ట మధు రాజకీయంగా వాడుకోవడం సిగ్గుచేటని అన్నారు.భవాని సేన్ పై ఆరోపణలు వచ్చిన 24 గంటల్లోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఐటీ మంత్రి శ్రీధర్ బాబు స్పందించి ఎస్సైని విధుల నుండి శాశ్వతంగా తొలగించి విచారణ చేపట్టారని, తప్పు చేసిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని. చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు . నేర ఆరోపణలు ఉన్నటువంటి భవని సేన్ ను మంతిని నియోజకవర్గానికి రెండో ఎస్సైగా తీసుకువచ్చింది నువ్వే కదాఎ ఈ ఘటనకు నైతిక బాధ్యత నువ్వే వహించాలని అన్నారు.2014 తర్వాత పుట్ట మధు మంథనిలో అనేక అరాచకాలకు పాల్పడ్డాడని శీలం రంగయ్య లాకాపు డెత్ అయితే పోలీసులకు వత్తాసు పలికాడని ,మంథని మధుకర్ హత్య కేసులో ఆధారాలు చెరిపివేసే ప్రయత్నం చేశాడని, రేవెల్లి రాజబాబును హత్య చేసినటువంటి హంతకులకు మద్దతు తెలిపింది నువ్వు కాదని అన్నారు. అధికారులకు ఫోన్ చేసి నేనే ఎమ్మెల్యే నేనే ప్రభుత్వం నేను చెప్పింది శాసనమని బెదిరింపులకు పాల్పడింది నువ్వు కాదా అని అన్నారు. పది సంవత్సరాలు అధికారంలో ఉండి చిన్న కాలేశ్వరానికి ఒక్క రూపాయి నిధులు తీసుకురాలేదని, ఓడేడు బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయలేదు, నాసిరకంతో నిర్మించడంతో గాలివానకు బ్రిడ్జి కూలడం జరిగిందని. కాలేశ్వరం ప్రాజెక్టులో అవినీతికి పాల్పడి వేలకోట్లు మింగి కాలేశ్వరం యొక్క ఖ్యాతిని మసకబార్చింది మీరే కదా అని అన్నారు. నిన్ను మంథని ప్రజలు మరిచిపోయారని మరోసారి చౌకబారు ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించడం జరిగింది..ఈకార్యక్రమంలో ఓడ్నాల శ్రీనివాస్, నూకల బాలయ్య, మంథని సత్యం, కుడుదుల వెంకన్న, జనగామ నర్సింగరావు ,కొత్త శ్రీనివాస్ ,అజీమ్ ఖాన్ ,గోటికార్ కిషన్ జి ,మధ్యల రాజయ్య, తదితరులు పాల్గోన్నారు.

# గొర్రెలు మృతికి కారణమైన రైస్ మిల్లు యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలి

**బూడిద గణేష్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి**



**మంథని ( ప్రశ్న న్యూస్)** మంథని మండలం ఎక్లాస్ పూర్ గ్రామానికి చెందిన గొర్రెల కాపరి గొర్రె రమేష్ కు చెందిన మూడు గొర్రెలు విద్యుత్ షాక్ గురై మృతి చెందాయి. ఈ రోజు వ్యవసాయ కార్మిక సంఘం బృందం బాధితుడు గొర్రె రమేష్ తో గొర్రెలు మృతి చెందిన సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా బూడిద గణేష్ మాట్లాడుతూ.. దాదాపు గత 25 సంవత్సరాలుగా సత్య సాయి రైస్ మిల్లు యాజమాన్యం మంథని బొక్కల వాగు నడి ఒడ్డున ఇరిగేషన్ శాఖ,మైనింగ్ శాఖ, రెవెన్యూ శాఖ,నీటి జల శాఖ అధికారుల అనుమతులు లేకుండా అక్రమంగా దొడ్డి దారిన బోరు వేసి బొక్కల వాగు నీటిని అక్రమంగా నీటి చౌర్యం చేస్తూ.రైస్ మిల్లుకు తరలిస్తున్నారు. ఈ నాలుగు శాఖల అధికారులు పరిమిషన్ ఇస్తేనే కరెంట్ కనెక్షన్ ఇవ్వాలి. కానీ విద్యుత్ అధికారులు సత్య సాయి రైస్ మిల్లు వరకు అనుమతులు ఇచ్చినప్పటికి రైస్ మిల్లు యజమాని అక్రమంగా రైస్ మిల్లు దగ్గర నుండి రోడ్డు కల్వర్టు కింది నుండి సొంతగా స్తంబాలు వేసి ట్రాన్స్ఫర్ ఏర్పాటు చేయకుండా నేరుగా విద్యుత్ వైరను బొక్కల వాగులో ఉన్న నీటి బోరుకు కనెక్షన్ అమర్చారు. ఈ యొక్క కరెంట్ తీగ పేలి నీటి గుంతలో మునగడం వలన కరెంట్ పాస్ అయ్యి నీరు త్రాగడానికి వచ్చిన ముగ జీవాలు (గొర్రెలు) కరెంట్ షాక్ కు గురై మృతి చెందడం జరుగుతుందనీ అన్నారు. ఈ నీటి గుంత వద్ద నుండి గంగపురి నుండి బోయిన్ పేటకు నిత్యం ప్రజలు వాహనదారులు రాకపోకలు కొనసాగిస్తారని మనుషులకు ఈ జరిగితే ఎంత గోరం జరిగేదో అని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక సామాన్య రైతు బోరు వేసుకొని నిరు వాడుకుంటే కేసులు పెట్టి జైలుకు పంపే అధికారులు ఒక రైస్ మిల్లు యజమాని కొన్ని సంవత్సరాలుగా అక్రమంగా నీటిని చౌర్యం చేస్తుంటే ఈ అధికారులు ఎం చేస్తున్నారని మండి పడ్డారు. ఈ మూగజీవాలా (గొర్రెలు) మృతి కి ఈ శాఖ అధికారులు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గంగపురి సత్య సాయి రైస్ మిల్లు యాజమాన్యం పై చట్ట పరమైన చర్యలు తీసుకొని బాధితుడు గొర్రె రమేష్ కుటుంబానికి న్యాయం చేయాలనీ బొక్కల వాగులో అక్రమంగా వేసిన బోరును సిజ్ చేసి విద్యుత్ కనెక్షన్ తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ బృందం లో సంఘం ఎల్పుల సురేష్, బాధితుడు గొర్రె రమేష్, యాదవ సంఘం నాయకులు గంట శ్రీను తదితరులు ఉన్నారు.

# చిన్నారులకు నులి పురుగుమందులను వేసిన కొల్చారం ఎంపీపీ మంజుల కాశీనాథ్ ..!!



**మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ )** కొల్చారం మండల పరిధిలోని ఎన్ని గంటలకు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు మరియు విద్యార్థులకు నూలి పురుగు మందులను వేసిన కొల్చారం ఎంపీపీ మంజుల కాశీనాథ్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొల్చారం మండల వ్యాప్తంగా ప్రతి అంగన్వాడి సెంటర్లో ప్రతి విద్యార్థికి చిన్నారులకు నూలి పురుగు మందులను చెయ్యాలని అంగన్వాడీ టీచర్లకు మరియు ఆశ వర్కర్లకు పిలుపునిచ్చారు ఈ మాత్రల ద్వారా ఇటువంటి దుష్ప్రబావాలు కలగమన్నారు ఈ మాత్రలు ఆరోగ్య సిబ్బందిచే పంపిణీ చేపడుతుందని ఒక అవకాశం పిల్లల తల్లిదండ్రులు ఉపయోగించుకొని పిల్లల ఆరోగ్యాన్ని కాపాడాలని కొల్చారం ఎంపీపీ మంజుల కాశీనాథ్ తెలిపారు ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి మరియు సిబ్బంది అంగన్వాడి టీచర్లు ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# టీయూడబ్ల్యూజే(ఐజెయు) రాష్ట్ర కార్యదర్శిగా కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి నియామకం

**- జర్నలిస్టుల గొంతుకగా పనిచేస్తా కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి**




**శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్)** టీయూడబ్ల్యూజే(ఐజెయు) రాష్ట్ర కార్యదర్శిగా కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఖమ్మంలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో రంగారెడ్డి జిల్లా అధ్యక్షునిగా కొనసాగుతున్న శ్రీకాంత్ రెడ్డికి రాష్ట్ర కార్యవర్గంలో కీలక పదవీ లభించింది.22 ఏళ్లుగా జర్నలిస్ట్ గా రంగారెడ్డి జిల్లాలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించిన శ్రీకాంత్ రెడ్డి గత కొన్ని సంవత్సరాలుగా జిల్లా అధ్యక్షునిగా కొనసాగుతున్నారు.జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ముందుండే శ్రీకాంత్ రెడ్డి ఉమ్మడి రంగారెడ్డి,ప్రస్తుత రంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా అందరి మన్ననలు పొందారు. జిల్లాలోని జర్నలిస్టులకు ఏ ఆపద వచ్చిన ముందుంటారని, ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో సేవలు అందించి మంచి పేరు తెచ్చుకొని జిల్లా పేరును అగ్రస్థానంలో నిలపాలని జిల్లా జర్నలిస్టులు ఆకాంక్షిస్తున్నారు. రాష్ట్ర కార్యదర్శిగా శ్రీకాంత్ రెడ్డి ఎన్నికవ్వటం పట్ల జిల్లాలోని ఆయా నియోజలవర్గాల, మండలాల యూనియన్ నేతలు, జర్నలిస్టులు,ప్రెస్ క్లబ్ ల నేతలు హర్షం ప్రకటించారు.జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ద్వేయంగా పనిచేస్తూ వారి గొంతుకగా ఉంటానని నూతన రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికవ్వటానికి సహకరించిన యూనియన్ సీనియర్ నేతలకు,33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులకు,నేషనల్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులకు, జర్నలిస్ట్ సోదరులకు ధన్యవాదాలు తెలిపారు. నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని హామీ ఇచ్చారు.అర్హులైన వారందరికీ అక్రిడేషన్ కార్డులు అందేలా కృషి చేస్తామన్నారు. రైల్వే రాయితీని పునరుద్ధరించేలా కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాము అన్నారు. మహాసభల్లో పాల్గొన్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,రెవిన్యూ, సమాచార శాఖ మంత్రి శ్రీనివాస్ రెడ్డి,వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ,మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిలు ఇళ్ల స్థలాల పట్టాలపై ఒక స్పష్టమైన హామీ ఇచ్చారని ఇది ఎంతో గొప్ప శుభవార్త అని పేర్కొన్నారు.మహాసభల్లో చేసిన తీర్మానాలను ముందుకు తీసుకెళ్లి అందరికీ అండగా ఉంటామన్నారు.

# నులి పురుగుల నిర్మూలన దినోత్సవ సందర్భంగా

అంగన్వాడి సెంటర్లో చిన్నారులకు మందులు వేసిన

రెడ్డిపల్లి ఉపసర్పంచ్ అశోక్ గౌడ్



**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )** నర్సాపూర్ మండల పరిధిలోని రెడ్డిపల్లి అంగన్వాడి సెంటర్లో చిన్నారులకు నులిపురుగుల మందులను వేసిన రెడ్డిపల్లి ఉపసర్పంచ్ అశోక్ గౌడ్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక సంవత్సరం వయసున్న పిల్లల నుండి 19 సంవత్సరాల వయసు కలిగిన పిల్లలకు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరిధిలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో ప్రతి ఒక్క చిన్నారులకు నూలి పురుగుల మందులు వేయాలని ప్రతి ఒక్కరికి విజ్ఞప్తి చేశారు ఈ మాత్రలు ఆరోగ్య సిబ్బందిచే పంపిణీ చేయబడుతుందని ఈ అవకాశాన్ని పిల్లలు తల్లిదండ్రులు ఉపయోగించుకొని పిల్లల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ హేమలత ఆయా ఏఎన్ఎం నాగరాణి ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయితీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి.

కడారి నాగరాజు, సీఐటీయూ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు.

అప్పుల పలు అవుతున్న పంచాయితీ కార్మికుడి కుటుంబాలు.



**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్)** ఎంఎల్ఏ క్యాంప్ కార్యాలయం గేటుకు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతి పత్రం. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయితీ కార్మికులు 52వేల మంది పనిచేస్తున్నారని, వారి కుటుంబాలు రోజు రోజుకు అప్పుల పలు అవుతున్నారని సీఐటీయూ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు కాడారి నాగరాజు అన్నారు. గురువారం నర్సాపూర్ ఎంఎల్ఏ క్యాంప్ కార్యాలయంలో ఎవరు లేకపోవడంతో గేటుకు డైమండ్స్ తో కూడిన వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 9నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పంచాయితీ కార్మికులు అనుభవిస్తున్నారని ఆయన అవేదన వ్యక్తం చేశారు. గ్రామాలలో అనేక సేవలు చేస్తూ ప్రజల ఆరోగ్యాలు, పల్లెలు అందంగా ఉండేలా చూడడంలో ప్రధాన భూమిక పోషించేది పంచాయితీ కర్మికుడేనని గుర్తుచేశారు. సమయానికి వేతనాలు రాకపోవడంతో పస్తులు ఉండాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. మరికొందరు పిల్లలు పాఠశాలలో చేర్పించాలని అప్పులు చేస్తూ తిప్పలు పడుతున్నారని మండిపడ్డారు. ప్రమాదవశాత్తు మరణిస్తే కనీసం పట్టి ఖర్చులు కూడా ఇవ్వకపోవడం ఏంటని ప్రశ్నించారు. పని ప్రదేశంలో మరణిస్తే 10 లక్షల ఎక్సగ్రెషియ, పట్టి ఖర్చులకు 20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, పెండింగ్ లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బందేలి, సలీం, నర్సింలు, మల్లేశం, పోచయ్య, లింగం, పెంటయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నాసిరకం గా రోడ్డు విస్తరణ పనులు, కుంగి పోయిన రోడ్డు

**ప్రమాదాలు జరుగుతున్న పట్టించుకోని ప్రభుత్వం**

**సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బీరెడ్డి సాంబశివా**



**వాజేడు (ప్రశ్న న్యూస్ )** వాజేడు మండలం లో 163 జాతీయ రహదారి గుంతలు పడి, పై భాగం తొలగి పోయి ప్రమాదకరం గా ఉండి, అనేక వాహనదారులు ప్రమాదాబారిన పడిన ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవటం లేదని సాంబ శివ మాటాడుతూ అన్నారు గురువారం సిపిఎం జనరల్ బాడీ సమావేశం లో సాంబ శివ మాట్లాడుతూ పాయబట్ల, సుందరయ్య కాలనీ, గుమ్మడిదొడ్డి, చీకుపల్లి, నల్లవాగు బ్రిడ్జ్, టేకులగూడెం గ్రామాలలో జాతీయ రహదారిపై గుంతలు ఏర్పడి ప్రమాదకరం గా ఉన్నాను మర్మతులు చేయటంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు అని వారు మాట్లాడుతూ అన్నారు ఇప్పటి వరకు అనేకమంది వాహన దారులు ప్రమాదలకు గురైన అధికారులు స్పందించాటం లేదని, పెదగొల్లగూడెం లో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులలో నాసిరకం గా పోయటం వలన రోడ్డు కుంగిపోయి గుంతలు పడ్డాయి అని, నాసిరకం గా పోసిన కాంట్రాక్టర్ పై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్న దాకలాలు లేవని, ప్రభుత్వం నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లేకపోవటం తో గుత్తేదారు ఇష్టరాజ్యం గా విస్తరణ చేశారు.

# వెహికల్ బీమాలో నకిలీలలు

- **బద్వేల్లో మరి ఎక్కువ**
- **తక్కువ ఖర్చు అవుతుందని వాహనదారుల మక్కువ**
- **ప్రమాదం జరిగితే ప్రయోజనం సున్నా**

**బద్వేలు** రవాణా వాహనాలకు ప్రతి సంవత్సరం సామర్థ్య పరీక్షలు ( ఫిట్నెస్ సర్టిఫికెట్- ఎఫ్ సి) తప్పనిసరి. వెహికల్ కండిషన్ చూసి రవాణా శాఖ అధికారులు ఎఫ్ సి చేస్తారు ఆ సమయంలో అన్ని పత్రాలు ఉండాలి వాటిలో బీమా తప్పనిసరి కార్లకు మూడు సంవత్సరాలు ద్విచక్ర వాహనానికి ఐదు సంవత్సరాలు అద్దె వాహనాలకు ప్రతి సంవత్సరం బీమా చేయించుకోవాలి ఒక లారీకి 40 వేల నుంచి 50 వేల రూపాయలు  అలాగే ఆటోకు 8000 రూపాయలు ఖర్చు అవుతుంది కొంతమంది వెహికల్ డ్రైవర్లు అంత మొత్తం కట్టలేక వేయి రూపాయలు 2000 రూపాయలు చెల్లించి ఏజెంట్ల వద్ద నకిలీ బీమా పత్రం తీసుకుని వాటిని ఆన్లైన్లో అప్లోడ్ చేస్తున్నారు అధికారులు కూడా వాటిపై ఇచ్చిన తేదీ గడువు ఉందా అని చూసి ఓకే చేస్తున్నారు కొద్ది రోజులకు ఏదైనా ప్రమాదంలో వెహికల్ డ్రైవర్ చనిపోతే అప్పుడు బీమా కింద నయా పైసా కూడా రాదు దీంతో కుటుంబాలు వీధిన పడుతున్నాయి కడప జిల్లాలో కొంత కాలం నుంచి నకిలీ బీమా పత్రాలు వెలుగులోకి వస్తున్నాయి

బద్వేలు నియోజకవర్గం అట్లూరు మండలానికి చెందిన ఒక మహిళ నకిలీ బీమా పత్రం పెట్టి తన వాహనానికి ఎఫ్ సి చేయించుకున్నారు బద్వేలు రవాణా శాఖ అధికారులు నిర్వహించిన తనిఖీ లో ఈ విషయం వెలుగులోకి వచ్చింది దీంతో అధికారులు ఆమెపై కేసు  నమోదు చేశారు అలాగే కడప నగరానికి చెందిన ఆటో డ్రైవర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు అతని కుటుంబ సభ్యులు ప్రమాద బీమాకు దరఖాస్తు చేసుకున్నారు బీమా కంపెనీ అధికారులు వచ్చి ఆటోకు సంబంధించిన పత్రాలు పరిశీలించారు అతను అప్పటికే నకిలీ పత్రలతో ఎఫ్ సి చేయించుకోవడం జరిగింది దీంతో ఆ కుటుంబానికి నయా పైసా కూడా రాలేదు ఇలాంటివి చాలా ఉన్నాయి ముఖ్యంగా బద్వేల్ పట్టణంలో ఒక వ్యక్తి నకిలీ బీమా పత్రాలు చేస్తున్నట్లు సమాచారం ఎంతోకాలంగా ఈ వ్యవహారం నడుస్తుంది కడప  జిల్లాలో గత కొంతకాలంగా నకిలీ బీమా పత్రాలు వెలుగులోకి రావడం చర్చనీయాంశంగా మారింది కడప బద్వేలు పులివెందుల ప్రొద్దుటూరు రవాణా శాఖ కార్యాలయాల వద్ద కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు దళారులు నకిలీ బీమా పత్రాలు తయారు చేస్తున్నారు ఇలాంటివి ప్రతిరోజు అయిదారు వస్తున్నాయి అవి చూడ్డానికి ఒరిజినల్ పత్రం లాగే ఉంటాయి దీంతో అధికారులు గుర్తించడం కష్టంగా మారింది అనుమానం ఉండి బార్కోడు తనిఖీ చేస్తే తప్ప గుర్తించలేక పోతున్నారు రవాణా శాఖ అధికారులు అన్నింటిని బార్కోడ్ తో తనిఖీ చేయాలంటే సాధ్యం కాదు దీంతో కొంతమంది దళారులు అధికారుల కళ్ళు కప్పి నకిలీలు పెట్టి పనులు చేయించుకుంటున్నారు అటు పోలీసు శాఖ ఇటు రవాణా శాఖ అధికారులు నకిలీ ఎఫ్సీలపై స్పెషల్ డ్రైవ్ చేపడితే దీనికి కొంతవరకైనా అడ్డుకట్ట పడుతుంది లేకుంటే  వెహికల్ దారులు తీవ్రంగా నష్టపోతారు

# పార్టీ మారడంలేదు

**గద్వాల** తాను ఏ పార్టీ మారడం లేదని  జోగులమ్మ గద్వాల నియోజకవర్గం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి స్పష్టం చేసారు.  అధికార పక్ష నాయకుల స్వప్రయోజనాల కోసం పార్టీ మారుతున్నారంటూ నాపై పుకార్లు పుట్టించి ప్రజలలో ఆందోళన కలిగించేలా చేశారని ఎమ్మెల్యే అన్నారు. అంటున్నారు . కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు ల వెంటే ఉంటానని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి వివరణ ఇచ్చారు.

# నాయుడుపేట సబ్ డివిజన్ పరిధిలో జిల్లా ఎస్పీ ఆకస్మికంగా సుడిగాలి పర్యటన

**తిరుపతి** గురువారం నాడు జిల్లా ఎస్పీ  వి. హర్షవర్ధన్ రాజు నాయుడుపేట సబ్ డివిజన్ పరిధిలో ఆకస్మికంగా సుడిగాలి పర్యటన చేశారు.

నాయుడుపేట సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయం, నాయుడుపేట సర్కిల్ కార్యాలయం, నాయుడుపేట, దొరవారి సత్రం, సూళ్లూరుపేట, తడ పోలీస్ స్టేషన్ లను ఆకస్మికంగా సందర్శించి, అధికారులు సిబ్బందిని అప్రమత్తం చేశారు.విధులలో ఉన్న ప్రతి ఒక్క పోలీసు సిబ్బంది, అధికారులతో మాట్లాడి వారి సాధక బాధలను అడిగి తెలుసుకుని, ఏవైనా శాఖా పరమైన సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు.ఈ సందర్భంగా సూళ్లూరుపేటలో మీడియా మిత్రులతో మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఓట్ల లెక్కింపు ప్రక్రియను జిల్లా పోలీసు సిబ్బంది అధికారుల సమిష్టి కార్యాచరణతో ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తి చేయడం చేయగలిగామన్నారు.సమస్యాత్మక గ్రామాలు, ప్రాంతాలలో పోలీస్ పికెట్లు, చెక్పోస్టులు లను మరికొన్ని రోజులు పాటు కొనసాగిస్తామన్నారు.విజిబుల్ పోలీసింగ్ ను పెంచి పబ్లిక్ న్యూసెన్స్ ను తగ్గించాలని ముఖ్య ఉద్దేశంతో ప్రస్తుతం ఒక ప్రణాళికాబద్ధంగా జిల్లా పోలీసు యంత్రాంగం పనిచేస్తున్నామన్నారు.

సరిహద్దు చెక్పోస్టులను మరింత బలోపేతం చేసి, గంజాయి వంటి నిషేధిత వస్తువుల అక్రమ రవాణా పై ఉక్కు పాదం మోపి, పవిత్రమైన తిరుపతి జిల్లాలో మత్తు పదార్థాల అవశేషాలు లేకుండా చేస్తామన్నారు. తడ సరిహద్దు చెక్పోస్టును ఆకస్మికంగా తనిఖీలు చేసి, విధులలో ఉన్న సిబ్బందిని అప్రమత్తం చేశారు. చెక్ పోస్ట్ వద్ద ఉన్న మౌలిక సదుపాయాలను పరిశీలించి, అవసరమైన సదుపాయాలను కల్పించాలని తడ ఎస్సై ని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిఎస్పీలు వెంకటాద్రి ఎస్బి, శ్రీనివాసరెడ్డి నాయుడుపేట, నాయుడుపేట సబ్ డివిజన్ సిఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక క్రమశిక్షణే యోగా

## (అంతర్జాతీయ యోగా డే సందర్భంగా)



యోగ మనస్సు, శరీరాల మధ్య సామరస్యాన్ని పెంపొందించే అత్యంత సూక్ష్మమైన అంశంపై ఆధారపడి ఉంది. ఇది ఒక ఆరోగ్యకరమైన మంచి జీవన కళ. 'యోగా' అనే పదం యుజ్ అనే సంస్కృత పదం నుండి ఉద్భవించింది, యుజ్ అంటే చేరడం లేదా కలపడం లేదా ఏకము చేయడం అనే అర్థాన్ని సూచిస్తుంది. యోగా ఆయుర్వేదం రెండు  చారిత్రాత్మకంగా దగ్గరి సంబంధం కలిగి ఉన్నాయి. పురాతన కాలం నుండి ఒకదానితో ఒకటి కలిసి అభివృద్ధి చెందాయి. యోగిక్ పవిత్ర రచనల ప్రకారం, యోగా యొక్క చర్య సార్వత్రిక స్పృహతో వ్యక్తిగత స్పృహ యొక్క ఐక్యతను ప్రేరేపిస్తుంది, మనస్సు, శరీరం, మనిషి, ప్రకృతి మధ్య ఆదర్శవంతమైన సారూప్యతను చూపుతుంది. యోగా మూడు దోషాలను అంటే వాత, పిత్త, కఫాలను సమతుల్యం చేస్తుందని విశ్వాసం. ఆధునిక శాస్త్రవేత్తలు సూచించినట్లుగా, విశ్వంలోని ప్రతిదీ ఒకే విధమైన వాతావరణం యొక్క రూపమే. అస్తిత్వం యొక్క ఈ ఏకత్వాన్ని అనుభవించే వ్యక్తి యోగాలో ఉంటాడని ముక్తి, మోక్షం లేదా మోక్షంగా సూచించబడిన స్వేచ్ఛా స్థితిని సాధించి యోగిగా మారతారు. అందువల్ల, యోగా యొక్క ప్రధాన లక్ష్యం స్వీయ-సాక్షాత్కారం, మోక్ష స్థితి' (మోక్షం) లేదా స్వేచ్ఛ (కైవల్య) ప్రేరేపించే అన్ని రకాల బాధలను అధిగమించడం. జీవితం, ఆరోగ్యం, సామరస్యం యొక్క అన్ని అంశాలలో స్వేచ్ఛతో జీవించడం యోగాభ్యాసం యొక్క ప్రాథమిక దృష్టి.

### యోగా చరిత్ర

యోగ శాస్త్రం కొన్ని వేల సంవత్సరాల క్రితం మత నమ్మకాల వ్యవస్థలు పుట్టక మందే యోగ శాస్త్రం తన  మూలాన్ని కలిగి ఉంది.యోగా యొక్క అభ్యాసం నాగరికత ప్రారంభంలోనే ప్రారంభమైందని మన పురాణాల వల్ల తెలుస్తుంది. పురాణాలలో శివుడిని ప్రధాన యోగి లేదా ఆదియోగి, ప్రధాన గురువు, ఆదిగురువుగా చూస్తారు.

కొన్ని వేల సంవత్సరాల క్రితం, హిమాలయాలలోని కాంతి సరోవర్ సరస్సు ఒడ్డున ఆదియోగి తన ముఖ్యమైన జ్ఞానాన్ని పురాణల్లో సప్తఋషులకు బోధించారు. ఋషులు ఈ సమర్థవంతమైన యోగ శాస్త్రాన్ని ప్రపంచంలోని వివిధ ప్రాంతాలకు వ్యాప్తిచెందెందుకు కృషిచేసారు. సింధు లోయ నాగరికత యొక్క ముద్రల సంఖ్య, శిలాజల అవశేషాలు, యోగ ఆలోచన ప్రక్రియలు, యోగా సాధన చేస్తున్న బొమ్మలు ప్రాచీన భారతదేశంలో యోగా ఉనికిని తెలుపుచున్నాయి. ఫాలిక్ చిహ్నాలు, మాతృ దేవత విగ్రహాల ముద్రలు తంత్ర యోగాను సూచిస్తాయి. జానపద సంప్రదాయాలు, సింధు లోయ నాగరికత, వేద ఉపనిషత్ వారసత్వం, బౌద్ధ, జైన ఆచారాలు, దర్శనాలు, మహాభారతం, రామాయణం యొక్క గాథలు, శైవులు, వైష్ణవులు, తాంత్రిక ఆచారాలలో యోగా ఉనికిని పొందవచ్చు. ఇంకా దక్షిణాసియాలోని ఆధ్యాత్మిక ఆచారాలలో స్పష్టమైన యోగ ఉంది. ఒక గురువు యొక్క తక్షణ మార్గ దర్శకత్వంలో యోగా సాధన చేసే సమయం ఆధ్యాత్మిక గౌరవానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది. ఇది ఉపాసనలో ఒక భాగమై యోగా సాధనలో అంతర్నిర్మితమైంది. వేద కాలంలో సూర్యుడికి అత్యంత ముఖ్యమైన ప్రాముఖ్యత ఇవ్వబడింది. ప్రాణాయామం రోజువారీ కర్మలో ఒక భాగం నైవేద్యాన్ని సమర్పించడం. వేదానికి పూర్వం యోగ సాధన జరిగినప్పటికీ, గొప్ప ఋషి మహర్షి పతంజలి తన యోగా సూత్రాల ద్వారా అప్పటికి ఉన్న యోగా అభ్యాసాలను, దాని ప్రాముఖ్యతను, దానికి సంబంధించిన సమాచారాన్ని క్రమబద్ధీకరించగా పతంజలీ వర్గీకరించారు. పతంజలి తరువాత, అనేక మంది ఋషులు, యోగా గురువులు అభ్యాసాలు, సాహిత్యంతో యోగాను పరిరక్షిస్తు అభివృద్ధికి సహకరించారు. ప్రస్తుత పరిస్థితులలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగా అభ్యాసాలపై  ప్రతి ఒక్కరికీ నమ్మకం ఉంది.

### అపురూపమైన పాఠాల ద్వారా యోగా ప్రపంచ వ్యాప్తంగా వ్యాపించింది

### యోగాతో శారీరక, మానసిక ఆరోగ్య ప్రయోజనాలు

యోగాతో శారీరక, మానసిక, ఆధ్యాత్మిక, ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని వీటిపై అవగాహన పెంచుకోవడం కోసమే ప్రతి ఒక్కరూ ప్రపంచ యోగా దినోత్సవం జరుపుకోవాలని చెబుతున్నారు. యోగ అంటే కేవలం శారీరక శ్రమ మాత్రమే కాదని, శ్వాస వ్యాయామాలతో కూడుకుని, మనుషులలో ఉన్నటువంటి ఒత్తిడిని, ఆందోళనను తగ్గించి, వారిని నిరాశ, నిస్పృహల నుండి బయటకు తీసుకురావడానికి ఉపయోగపడుతుందనీ యోగా గురువులు చెబుతున్నారు.

### యోగా ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ

ప్రతి సంవత్సరం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించడంలో భాగంగా ఒక నిర్దిష్టమైన థీమ్ ని తీసుకుంటారు. 2024 సంవత్సరంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ అన్న థీమ్ ను తీసుకున్నారు. అంటే యోగ మన కోసం మన సొసైటీ కోసం అన్న థీమ్ తో ప్రతి ఒక్కరు యోగ సాధన చేయాల్సిన అవసరాన్ని చెబుతున్నారు.

### యోగా రకాలు

#### హఠ యోగా:

ఇది యోగా యొక్క పురాతన రూపాలలో ఒకటి, ఇందులో ఆసనాలు (భంగిమలు) ప్రాణాయామం (శ్వాస వ్యాయామం) ఉన్నాయి, ఇది మనస్సు, శరీరానికి శాంతిని కలిగిస్తుంది. ధ్యానం వంటి లోతైన ఆధ్యాత్మిక అభ్యాసాల కోసం శరీరాన్ని సిద్ధం చేయడంలో సహాయపడుతుంది.

#### విన్యాస యోగ

1980ల చివరలో సాంప్రదాయ అష్టాంగ వ్యవస్థ నుండి స్వీకరించబడిన యోగా యొక్క క్రియాశీల, అథ్లెటిక్ శైలి. ఇది తప్పనిసరిగా శ్వాసతో సమకాలీకరించబడిన కదలిక అని అర్థం. సూర్య నమస్కారం ద్వారా వేగవంతమైన ప్రవాహం ఆధారంగా ఒక శక్తివంతమైన శైలి. ఇది ఒక భంగిమ నుండి మరొక భంగిమకు నిరంతర ప్రవాహాన్ని కూడా సూచిస్తుంది.

#### అష్టాంగ యోగం

అష్టాంగ అనేది శ్రీ కె. పట్టాభి జోయిస్ ద్వారా ఆధునిక ప్రపంచానికి తీసుకువచ్చిన యోగా వ్యవస్థ. ఈ రకమైన యోగా ఆరు శ్రేణులను కలిగి ఉంటుంది ప్రతి శ్రేణి ఆసనాల సమితి క్రమం, ఎల్లప్పుడు ఒకే క్రమంలో ఉంటుంది. ఇది సాధారణంగా వేగవంతమైనది, శక్తివంతమైనది. శారీరకంగా సవాలుగా ఉంటుంది.

#### పవర్ యోగా

పవర్ యోగా అనేది శక్తివంతమైన, విన్యాస-శైలి యోగాగా వర్ణించబడింది. పవర్ యోగా యొక్క ప్రజాదరణ ప్రపంచవ్యాప్తంగా వ్యాపించి ప్రతిచోటా బోధించబడుతోంది. శైలి మారవచ్చు కాబట్టి, దానిని ప్రదర్శించే ముందు మీరు వ్యక్తిగత బోధకులను సంప్రదించాలని సిఫార్సు చేయబడింది.

#### బిక్రమ యోగ

ఇది ఇరవై ఆరు భంగిమలు రెండు శ్వాస పద్ధతులను కలిగి ఉంటుంది. యోగా యొక్క ఈ శైలి టాక్సిన్స్‌ను ఫ్లష్ చేయడానికి, బరువును నిర్వహించడానికి ప్రదర్శకులు భంగిమల్లోకి మరింత లోతుగా కదలడానికి అనుమతిస్తుంది.

#### జీవముక్తి యోగ

ఈ యోగా శైలి 1984లో సృష్టించబడింది. ఈ యోగ శైలిలో పఠించడం, ధ్యానం, పఠనాలు, ధృవీకరణలు చేస్తారు.

#### అయ్యంగార్ యోగా

ప్రతి ఆసనంలోని ఖచ్చితమైన మస్క్యులోస్కెలెటల్ అమరికపై మరింత శ్రద్ధ చూపే ప్రయత్నంలో ఈ రకమైన యోగాలో భంగిమలు ఎక్కువసేపు ఉంచబడతాయి. అయ్యంగార్ యొక్క మరొక ట్రేడ్‌మార్క్ బ్లాక్‌లు, బెల్ట్‌లు, బోల్‌స్టర్‌లు, కుర్చీలు మరియు దుప్పట్లు వంటి ఆధారాలను ఉపయోగించడం, వీటిని గాయాలు, బిగుతు లేదా నిర్మాణ అసమతుల్యతలకు అనుగుణంగా ఉపయోగిస్తారు, అలాగే విద్యార్థికి సరిగ్గా భంగిమలో ఎలా కదలాలో నేర్పుతారు.

#### అనుసార యోగం

అనుసర స్టైల్ అనేది హఠా యొక్క కొత్త వ్యవస్థ, ఇది అన్ని యోగా భంగిమలకు అంతర్లీనంగా ఉండే యూనివర్సల్ ప్రిన్సిపల్స్ ఆఫ్ అలైన్‌మెంట్‌ను బోధిస్తుంది, అదే సమయంలో దయతో ప్రవహించడాన్ని ప్రోత్సహిస్తుంది.

#### శివానంద యోగ

ఇది సాధారణంగా సవసనా (సడలింపు భంగిమ), కపాలభాతి అనులోమ విలోమాతో ప్రారంభమవుతుంది, తర్వాత కొన్ని రౌండ్ల సూర్య నమస్కారాలు ఉంటాయి. అప్పుడు అది శివానంద పన్నెండు ఆసనాల ద్వారా కదులుతుంది, ఇవి వెన్నెముక యొక్క బలం, వశ్యతను పెంచడానికి రూపొందించబడ్డాయి. మంత్రోచ్ఛారణ, ధ్యానం కూడా దానిలో భాగం కావచ్చు.

#### వినియోగ

అనేది వ్యక్తి యొక్క ప్రత్యేక స్థితి, అవసరాలు, ఆసక్తులకు అనుగుణంగా వివిధ సాధనాలు, అభ్యాస పద్ధతులను స్వీకరించే యోగా విధానాన్ని సూచిస్తుంది. యోగా యొక్క ఈ శైలి స్వీయ-ఆవిష్కరణ, వ్యక్తిగత పరివర్తనలో సహాయపడుతుంది.

#### కుండలినీ యోగ

కుండలిని బహుళ కదలికలు లేదా వ్యాయామాలు, డైనమిక్ శ్వాస పద్ధతులు, పఠించడం, ధ్యానం, మంత్రాలను కలిగి ఉంటుంది. ప్రతి నిర్దిష్ట కుండలిని వ్యాయామం, క్రియాగా సూచించబడుతుంది, ఇది తరచుగా పునరావృతమయ్యే శ్వాసతో సమకాలీకరించబడిన కదలిక. ప్రతి ఏడు చక్రాల ద్వారా పైకి లాగడానికి వెన్నెముక యొక్క బేస్ వద్ద శక్తిని మేల్కొల్పడానికి అభ్యాసం రూపొందించబడింది.

#### యిన్ యోగా

యిన్ యోగా అనేది స్లో-పేస్డ్ స్టైల్, దీనిలో భంగిమలు ఐదు నిమిషాలు లేదా అంతకంటే ఎక్కువసేపు ఉంచబడతాయి. ఇది నిష్క్రియాత్మకమైనప్పటికీ, యిన్ యోగా దీర్ఘకాల హోల్డ్‌ల కారణంగా చాలా సవాలుగా ఉంటుంది, ప్రత్యేకించి మీ శరీరం దానికి అలవాటు పడకపోతే. కీళ్లలో ప్రసరణను పెంచడం వశ్యతను మెరుగుపరచడం లక్ష్యంగా బంధన కణజాలం - స్నాయువులు, అంటిపట్టుకొన్న తంతుయుత కణజాలం మరియు స్నాయువులు - మితమైన ఒత్తిడిని వర్తింపజేయడం దీని ఉద్దేశ్యం.

యోగా ఒకరి శరీరం, మనస్సు, భావోద్వేగం, శక్తి స్థాయిలో పనిచేస్తుంది. ఇది యోగా యొక్క నాలుగు విస్తృత వర్గీకరణలకు దారితీసింది.

**కర్మ యోగా:  ఇక్కడ మనం శరీరాన్ని ఉపయోగిస్తాము.**

**భక్తి యోగా:  ఇక్కడ మనం భావోద్వేగాలను ఉపయోగిస్తాము.**

**జ్ఞానయోగా: ఇక్కడ మనం మనస్సు, తెలివిని ఉపయోగిస్తాము**

క్రియా యోగ: ఇక్కడ మనం శక్తిని ఉపయోగిస్తాము. యోగాపై పురాతన వ్యాఖ్యానాలన్నీ గురువు ఆధ్వర్యంలో యోగా చేయడంపై దృష్టి పెట్టాయి. కారణం ఏమిటంటే, ప్రతి సాధకునికి అవసరమైన విధంగా, నాలుగు ప్రాథమిక మార్గాల సముచిత కలయికను ఒక గురువు మాత్రమే కలపగలరు. ఈ రోజుల్లో, ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మిలియన్ల మంది ప్రజలు ప్రతిరోజు యోగాను అభ్యసించడం ద్వారా ప్రయోజనం పొందుతున్నారు, ఇది పురాతన కాలం నుండి నేటి వరకు గొప్ప ప్రముఖ యోగా గురువుల ద్వారా సంరక్షించబడి యోగా సాధన అభివృద్ధి చెంది ప్రతిరోజు మరింత ఉత్సాహంగా పెరుగుతోంది.



**రవికుమార్ సంతోజ**
**బడంగ్ పేట్**

ప్రజాప్రశ్న
హైదరాబాద్, శుక్రవారం 21, జూన్ 2024

# కాళేశ్వరం ఎస్ఐ భవాని సేన్‌ను సర్వీస్ నుండి శాశ్వతంగా తొలగింపు

**– మల్టీజోన్ ఐజిపి ఏవి రంగనాథ్**




**కాళేశ్వరం** మహిళా పోలీస్ కానిస్టేబుల్ పై లైంగిక దాడులకు పాల్పడినందు గాను కాళేశ్వరం ఎస్ఐ భవాని సేన్ ను సర్వీస్ నుండి శాశ్వతంగా తొలగిస్తూ మల్టీ జోన్ 1 ఐ జి పి శ్రీ ఏ. వి. రంగనాథ్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.కాళేశ్వరం పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న మహిళా హెడ్ కానిస్టేబుల్ పై స్టేషన్ ఎస్. ఐ భవాని సేన్ తుపాకీ చూపించి లైంగిక దాడికి పాల్పడినట్లు సదరు మహిళా హెడ్ కానిస్టేబుల్ పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో భూపాలపల్లి ఎస్పీ చేపట్టిన విచారణలో ఎస్ ఐ, మహిళా హెడ్ కానిస్టేబుల్ పై లైంగిక దాడికి పాల్పడినట్లుగా నిజ నిర్ధారణ కావడంతో పాటు ఎస్ ఐ, భవాని సేన్ గత 2022 జులై మాసంలో లైంగిక వేధింపులకు పాల్పడంతో ఇతనిపై ఆసిఫాబాద్ జిల్లా రెబ్బన పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయడం జరిగింది.సదరు ఎస్ఐ తన హోదా అడ్డుపెట్టుకొని మరో ముగ్గురు మహిళా పోలీస్ కానిస్టేబుళ్ల పై లైంగిక దాడులకు పాల్పడినట్లుగా ఆరోపణలు రావడంతో పాటు ఎస్ఐ తరుచుగా లైంగిక దాడులు, వేధింపులకు పాల్పడే వ్యవహారం పోలీస్ శాఖ కీర్తి ప్రతిష్ట దిగజార్చే విధంగా ఉంది.ఎస్ఐ పై ఈ పరిస్థితుల్లో విచారణ చేయడం సరైన నిర్ణయం కాదనే ఆలోచనతో కాళేశ్వరం ఎస్ఐ భవాని సేన్ పై, ఎలాంటి విచారణ లేకుండానే భారత రాజ్యాంగాన్ని అనుసరిస్తూ ఆర్టికల్ 311 ప్రకారం సర్వీసు నుండి శాశ్వతంగా తొలగిస్తున్నట్లుగా మల్టీ జోన్ ఐజిపి ఏవి. రంగనాథ్ వెల్లడించారు.

# మక్కాలో తీవ్రమైన వేడి..

**– మృతిచెందిన హజ్ యాత్రికుల్లో 90 మంది భారతీయులే.**



ముస్లింల పవిత్ర హజ్ యాత్ర ఈసారి విషాదాంతమైన విషయం తెలిసిందే. ప్రస్తుతం సౌదీ అరేబియాలో ఎండలు దంచికొడుతున్నాయి. మునుపెన్నడూ లేనివిధంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ఉష్ణతాపానికి హజ్ యాత్రికులు అల్లాడిపోతున్నారు. తీవ్రమైన వేడికి యాత్రికులు మృత్యువాత పడుతున్నారు. ఇక ఇప్పటి వరకూ 645 మంది చనిపోయినట్లు అధికారిక వర్గాలు తాజాగా వెల్లడించాయి.చనిపోయినవారిలో వివిధ దేశాలకు చెందిన యాత్రికులు ఉన్నట్లు చెప్పారు. ఈజిప్ట్, జోర్డాన్ దేశస్తులు అధికంగా ఉన్నట్లు తెలిపారు. సుమారు 323 మంది ఈజిప్టియన్లు కాగా, 90 మందికిపైగా జోర్దానియన్లు మరణించినట్లు తెలిపారు. అయితే, చనిపోయిన యాత్రికుల్లో దాదాపు 90 మంది భారతీయులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఓ దౌత్యాధికారి వెల్లడించినట్లు అంతర్జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి.అయితే, భారతీయుల సంఖ్యపై సౌదీ అధికారులు గానీ, భారత ప్రభుత్వం గానీ ఇప్పటి వరకూ ఎలాంటి అధికారిక ప్రకటనా చేయలేదు. మక్కాలో ప్రస్తుతం 50 డిగ్రీల సెల్సియస్‌కు పైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ సారి యాత్రలో దాదాపు 18.3 లక్షల మంది పాల్గొన్నారని, వారిలో 22 దేశాలకు చెందిన 16 లక్షల మంది ఉన్నట్లు సౌదీ హజ్ నిర్వాహకులు వెల్లడించారు. మరో రెండు లక్షల మంది సౌదీ అరేబియా వాసులుగా పేర్కొన్నారు.ఎండ తీవ్రతకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఉపశమనం కలిగించడం లేదని అధికారులు పేర్కొన్నారు. మక్కాలోని అతిపెద్ద ఆసుపత్రుల్లో ఒకటైన అల్–ముయిసెమ్ ఆసుపత్రిలో మృతదేహాలను ఉంచినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఆ మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కాగా, గతేడాది హజ్ యాత్రలో 240 మంది యాత్రికులు చనిపోయారు. వారాలో చాలా మంది ఇండోనేషియాకు చెందిన వారే ఉన్నట్లు సౌదీ మీడియా తెలిపింది.

# ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి

**– మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**

**– కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**

**మహేశ్వరం** మహేశ్వరం మండలం లో ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ ఆడబిడ్డ పెళ్లి చేసిన తల్లిదండ్రులు అందరికీ ఎన్నో రోజుల నుంచి వేచి ఉన్న కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా నేడు 148 చెక్కులు పంపిణీ చేయడం జరిగిందని ఒక మహేశ్వరం మండలంలోని 123 మందికి తుక్కుగూడలో 25 మందికి నేడు పంపిణీ చేయడం జరిగిందని.అదేవిధంగా మహేశ్వరం మండలంలోని ఇప్పటివరకు 2500 మందికి కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేయడం జరిగిందని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు.అంతేకాకుండా ఎన్నికల కంటే ముందు ఒక హామీ ఇచ్చింది ఈ ప్రభుత్వం అధికారంలోకి రాగానే లక్ష రూపాయలు దానితోపాటు తులం బంగారం కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ లబ్ధిదారులకు అందజేస్తామని హామీ ఇచ్చారు కానీ ఇప్పటివరకు అట్టి హామీ అమల్లోకి తేలేదు కాబట్టి త్వరితగతిన అట్టి హామీని పూర్తి చేయవలసిన అవసరం ఎంతో ఉందని మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, మహిళా నాయకురాలు, తదితరులు పాల్గొన్నారు.

# ఎంపిపి కార్యాలయం ప్రారంభోత్సవంలో ప్రోటోకాల్ లొల్లి

**సంగారెడ్డి** సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నూతన ప్రజాపరిషత్ కార్యాలయం ప్రారంభోత్సవంలో ప్రోటోకాల్ లొల్లి లేచింది. శిలాపలకంపై వైస్ ఎంపీపీ పేరుపెట్టి ఎంపీటీసీల పేర్లు పెట్టకపోవడంతో ప్రోటాకల్ మిస్ చేశారంటూ కాంగ్రెస్ నాయకులు నిలదీసారు. రెండవ శిలాపలకంలో ఎంపీటీసీల పేర్లుపెట్టడంతో ఆగ్రహం వ్యక్తంచేసారు. ఎంపీపీ,వైస్ ఎంపీపీ ఇద్దరు కూడ బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు. నూతన కార్యాలయం ఆవరణలో బీఆర్ఎస్ పార్టీకి చెందినా ఫ్లెక్సీలు పెట్టడం ఏంటంటూ గట్టిగా నిలదీసారు. రెండు విషయాలపై బీఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీల నాయకుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. అధికారులు చేసినా పొరపాటుకు రెండుపార్టీల మధ్య ఘర్షణ నెలకొంది. ప్రోటాకల్ తప్పుయితే ఉన్నత అధికారులకు సూచనల మేరకు కొత్త శిలాపలకాలు మారుస్తామని ఎంపీడీఓచెప్పారు.

# అయ్యోనివా.. నువ్వు అవ్వోనివా...

## నేడు ఆయన వర్థంతి



గూడ అంజయ్య తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రముఖ గేయ కవి, కథా రచయిత. లక్ష్మమ్మ, లక్ష్మయ్య దంపతులకు 1955లో ఆదిలాబాద్ జిల్లా, దండేపల్లి మండలం, లింగాపురం గ్రామంలో అంజయ్య జన్మించాడు. ఆయనకు ఐదుగురు సహోదరులున్నారు. ఆయన ప్రాథమిక విద్యను లింగాపురం గ్రామంలో చదివారు.ఇంటర్మీడియట్ వరకు లక్సెట్టిపేటలో చదివిన ఆయన.. తర్వాత హైదరాబాద్ లో బీ ఫార్మసీ పూర్తి చేశారు. ఫార్మసిస్టుగా కూడా పనిచేశారు.నలభై ఏళ్లుగా కవిగా, రచయితగా ఎన్నో కథలు, పాటలు రాసిన అంజయ్య కలకాలం నిలిచిపోయే పాటలు రాశాడు. వీటన్నింటికి తోడు సినిమాల్లో పాటలు రాసిన తర్వాత తెలుగు నేల నలుమూలలా ఆబాలగోపాలం అందరి నోళ్లలో నానుతున్నాడు. వృత్తిరీత్యా హైదరాబాద్‌లో ఫార్మసిస్ట్‌గా పనిచేశాడు. ఆయన పక్షవాతం వ్యాధితో బాధపడుతున్నప్పుడు తెలంగాణ ప్రభుత్వం వైద్యం చేయడానికి ముందుకు వచ్చింది.ఆయన వ్రాసిన "ఊరు మనదిరా" పాట 16 భాషలలో అనువాదమయింది. ఆయన తెలంగాణ సాంస్కృతిక సంఘ నాయకునిగా పనిచేసాడు.పల్లెలో పుట్టి పెరిగారు కాబట్టే.. ఆ వాతావరణం.. అక్కడి పరిస్థితులే ఆయన పాటలకు ప్రాణమయ్యాయి. పేదల కన్నీళ్లే ఆయన కలంలో సిరా అయ్యాయి. వారి గోసను ప్రపంచానికి చాటి చెప్పాయి. అందుకే ప్రజా కవుల్లో గూడ అంజయ్యది ప్రత్యేక స్థానం. ఆయన ఎవరికి అందని సాహితీ శిఖరం.బడికి పోతున్న సమయంలో దారినపోతున్న ఒక రైతును పలకరించగా ఊరిడిసి పోవన్నా..ఉరిపెట్టుకోవన్నా... అన్న మాటలే తన తొలి పాటకు అన్న ప్రాసన చేశాయని..తను కళ్లారా చూసిన కష్టాలకు, వాటిని అనుభవిస్తున్న వారి నోట వచ్చిన మాటల స్ఫూర్తిగా పాటలల్లడం తనకు బాల్యంలోనే అబ్బిన విద్య అని అసలేని వానల్ల ముసలెడ్లు కుట్టుకొని.. అనే ఆయన తొలిపాట పుట్టుకకు నేపథ్యం అదేనని అంజయ్య ప్రతి సభలోనే చెప్పేవాడు.చిరుత ప్రాయమునాడే అన్నన్నివేశం బాధ కలిగిస్తే ముందుగా తానే ఏడుస్తారు. అందుకే ఆయన పాటలు ప్రజల గుండెలను అంతలా హత్తుకుంటాయి. కేవలం ప్రజా సమస్యలే కాదు.. తెలంగాణ పోరాటంలోనూ గూడ అంజయ్య కీలక పాత్ర పోషించారు. తొలి దశ ఉద్యమంలో అనేక ఆందోళనల్లో పాల్గొన్నారు. 1975లో ఎమర్జెన్సీ టైంలో తెలంగాణ నినాదంతో ముందుకెళ్లడంతో.. జైలు జీవితం కూడా గడపాల్సి వచ్చింది. అయినా ప్రజా ఉద్యమ బాటను వీడలేదు. మలిదశ ఉద్యమంలోనూ తనవంతు పాత్ర పోషించారు అంజయ్య. పాటలతో ఉద్యమానికి ప్రాణం పోశారు. రసమయి బాలకిషన్ తో కలిసి ధూం?ధాం.. ప్రారంభించి ఉద్యమానికి కొత్త శక్తినిచ్చారు. అయ్యోనివా.. అవ్వోనివా అంటూ వలస పాలకులను ప్రశ్నిస్తూ.. ఉస్మానియా క్యాంపస్ లో ఉదయించిన కిరణమా అంటూ యువతలో పోరాట స్ఫూర్తిని నింపారు. దళితులపై కొనసాగుతున్న వివక్షపైనా పోరాటం చేశారు అంజయ్య. నట్టు చిన్న వయస్సులోనే జనం కష్టాలకు అక్షర రూపమిచ్చారు. అంటే అప్పటికే ఆయన సమాజాన్ని ఎంత లోతుగా అర్థం చేసుకున్నారో దీన్ని తెలుసుకోవచ్చు. ఆ రోజుల్లో ఊళ్లో వడ్డీ వ్యాపారుల అకృత్యాలకు బలైన ఓ పెద్దాయన చెప్పిన మాటలను? పాటగా మార్చి రచనారంగంలో తొలి అడుగేశారు అంజయ్య. ఏదో పాట రాయాలని రాసే వ్యక్తి కాదు గూడ అంజయ్య. పరిస్థితిని, సంఘటనను ముందుగా తాను ఫీల్ అయ్యి రాసే వ్యక్తి. జనం బాధను తన బాధగా భావించే సాహితీవేత్త అంజయ్య. ఆయన పాట సజీవమైనది. వారిపైన జరుగుతున్న దాడులను ప్రశ్నించారు. అంజయ్య పాటలు మనసును హత్తుకోవడమే కాదు.. ఆలోచన రేకెత్తిస్తాయి. అందుకే.. జీవిత సత్యాలు తెలియకుంటే పాటలు రాయలేమంటారు అంజయ్య. అదీలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో విప్లవోద్యమ నిర్మాణం జరుగుతున్న సమయంలో ఈ పెత్తందార్ల పాలనలో పీడిత జనానికి విముక్తి లేదని, జన ఐక్యతతో ప్రజోద్యమాల ద్వారా శ్రామిక రాజ్యం స్థాపించడమే ఏకైక మార్గమని నమ్మి ఉద్యమ బాటలో పయనించాడు. ఉన్నత చదువులకోసం హైదరాబాద్ హాస్టల్‌కు మకాం మార్చిన అంజన్నకు ప్రపంచ ఉద్యమాల పరిచయం ఏర్పడింది. తనలాగే జనం కోసం పాకులాడే వారు హైదరాబాద్‌లో చాలామంది ఉన్నారని తెలుసుకున్న అంజయ్య వారందరిని కలుపుకున్నాడు. అరుణోదయ సాంస్కృతిక సంస్థను స్థాపించి జనంనోట విన్న పదాలనే పాటలుగా రాసి బాణీలు కట్టి తెలుగురాష్ట్రం మెత్తం తిరుగుతూ ప్రజల నుండి నేర్చుకుంటూ, ప్రజల ఆలోచనల్లో మార్పుకోసం తన పాటల ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని కలిగించాడు. మహాకవి శ్రీశ్రీతో అనేక సభల్లో పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి, అరుణోదయ కళాసంస్థల ద్వారా తన గళాన్ని ప్రపంచానికి వినిపించారు. తెలంగాణ సాంస్కృతిక సంఘ నాయకుడిగాకూడా పనిచేశారు. పలు సినిమాల్లోనూ నటించారు. అవార్డుల కోసం ఏనాడు పాట రాయలేదంటారాయన. కేవలం పేదోడికోసమే తన పాటను అంకితం చేశానని ధైర్యంగా చెబుతారు. వచ్చిన అవార్డులతోనే సంతృప్తి చెందారు. జనంలోంచి వచ్చిన జానపదమే తన ప్రాణపాదమని నమ్మి? చివరివరకు అదే మాటపై ఉన్నారు. 1988 రజనీ తెలుగు సాహితీ సమితి అవార్డు, 1986లో సాహిత్య రత్న బంధు, 2000 లో గండె పెండేరా బిరుదుతో సత్కారం, 2004లో నవ్య సాహిత్య పరిషత్ నుంచి డాక్టర్ మలయశ్రీ సాహితీ అవార్డు అంజయ్యను వరించాయి. 2015లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సాహితీ పురస్కారంతో సత్కరించింది. 2015లో సుద్దాల హన్మంతు–జానకమ్మ స్మారక పురస్కారాన్ని అందుకున్నారు.కొంతకాలంగా కామెర్లు, మూత్రపిండాల వ్యాధితో బాధపడిన ఆయన జూన్ 21, 2016 రంగారెడ్డి జిల్లా రాగన్నగూడలోని స్వగృహంలో ప్రాణాలు విడిచాడు.


# ఆరోగ్యవంతమైన పిల్లల కోసం ఆల్బెండజోల్ మందులు వేయించాలి




ఆరోగ్యవంతమైన పిల్లల కోసం ఆల్బెండజోల్ మందులు వేయించి, వారికి నులిపురుగు ల నుండి రక్షణ పొందాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ అన్నారు. గురువారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకొని ప్రగతి నగర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ మమతా రెడ్డితో కలిసి పాల్గొని మందుల పంపిణీని కార్యక్రమాన్ని ప్రారంభించి, పాఠశాలలో చదివే విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులు అందించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నులి పురుగులు మన శరీరంలో ఉండటం వల్ల మనం తీసుకునే ఆహారంలో పోషకాలను గ్రహిస్తాయని, దీని వల్ల అనీమియా, రక్త స్రావం, ఎదుగుదల సరిగా లేకపోవడం జరుగుతాయని, వీటి నివారణ కు తప్పనిసరిగా నులి పురుగుల నివారణ మందులు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేయాలని, ఏజ్ గ్రూప్ వారిగా నిర్దేశిత మందుల డోస్ ప్రతి విద్యార్థికి చేరేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అన్నారు.జిల్లాలోని 1 నుండి 19 సంవత్సరాల వయస్సు ఉన్న 2,27,251 మంది పిల్లలకు నులిపురుగుల నివారణ మందులు అందించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని అదనపు కలెక్టర్ తెలిపారు. నులి పురుగుల నివారణ కోసం జిల్లాలో బఫర్ స్టాక్ తో కలిపి మొత్తం 2,49,976 ఆల్బెండజోల్ మాత్రలు సిద్ధం చేశామని ఆమె పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్ వాడి కేంద్రాలలో, ప్రభుత్వ, ప్రభుత్వేతర పాఠశాలలో, జూనియర్ కళాశాలలో, సాంకేతిక కళాశాలలో మందులను ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని అదనపు కలెక్టర్ తెలిపారు. నేడు నులి పురుగుల నివారణ మాత్రలు తీసుకొని విద్యార్థులకు జూన్ 27న మరో మారు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.వ్యక్తిగత పారిశుద్యం పట్ల ప్రతి విద్యార్థికి అవగాహన కల్పించాలని, ఆహారం తీసుకునే ముందు, టాయిలెట్ వినియోగించిన తరువాత తప్పనిసరిగా చేతులు కడుక్కోవాలని అదనపు కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. పిల్లలందరూ ఆల్బెండజోల్ మాత్రలు తీసుకొని నులిపురుగుల బారి నుండి రక్షణ పొంది ఎనీమియా, తదితర జబ్బులు రాకుండా మానసిక, శారీరకంగా ఆరోగ్యంగా ఉంటూ అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ దాసరి మమతా రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మందులను తీసుకోవాలని అన్నారు. పిల్లలు చిన్నతనం నుంచే వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఇంటిలో ఉన్న కుటుంబ సభ్యులందరికీ వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కల్పించాలని మున్సిపల్ చైర్ పర్సన్ కోరారు.నులి పురుగుల నివారణ మందుల వల్ల ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని అన్నారు. పిల్లలు చిన్నప్పటి నుంచి పౌష్టికాహారం తీసుకోవాలని, జంక్ ఫుడ్ అలవాట్లు మానుకోవాలని అన్నారు. పాఠశాలలో అందించే రాగి జావ, మధ్యాహ్న భోజనంలో అందించే గుడ్లు మంచి పౌష్టికాహారమని , వీటిని విద్యార్థులు తప్పనిసరిగా రెగ్యులర్ గా తిన్నాలని అన్నారు. నులిపురుగుల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో అందరు సద్వినియోగం చేసుకోవాలని, తప్పని సరిగా 19 సంవత్సారాలలోపు వయస్సు కల్గిన ప్రతి ఒక్కరు నివారణ మందులు వేసుకోవాలని, ఈ రోజు మిస్సైన వారి కోసం జూన్ 27న మరోమారు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. నులిపురుగుల నివారణ మందులు తీసుకోవడంతో పాటు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, మనం మన పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఆమె విద్యార్థినులకు సూచించారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్ , జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. ప్రమోద్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కల్పన, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి రంగారెడ్డి, జిల్లా మైనార్టీ అధికారి మేరాజ్ మహ్మద్, ఎం ఈ ఓ సురేందర్, పాఠశాల హెడ్మాస్టర్ టి.అరుణ, మెడికల్ ఆఫీసర్ పిహెచ్ సి రాఘవపూర్ డాక్టర్ మమత, ఎమ్ ఎల్ హెచ్ పి పెద్దపల్లి డాక్టర్ కీర్తన, ఏఎన్ఎం పి.సునీత, ఆశ వర్కర్ ఎ.జ్యోతి, సంబంధిత అధికారులు,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## శంకుస్థాపన చేసిన ప్రాంతంలో ప్రణమిల్లిన చంద్రబాబు

**అమరావతి** ఏపీ సీఎం చంద్రబాబు గురువారం అమరావతిలో పర్యటించారు. వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన పలు నిర్మాణాలు, రాజధాని ప్రాంత స్థితిగతుల్ని ఆయన పరిశీలించారు. ఈక్రమంలో ఆయన ఉద్దండరాయునిపాలెం బయల్దేరి ప్రధాని మోదీ శంకుస్థాపన చేసిన



# రుణమాఫీకి కసరత్తు

**హైదరాబాద్ :** రుణమాఫీ పథకం అమలు పై తెలంగాణ సర్కార్ కసరత్తు షురూ చేసింది. ఆగస్టు 15వ తేదీలోపు రూ. 2 లక్షల లోపు రైతు రుణాలను మాఫీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి పదే పదే చెబుతున్నారు.తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఆగస్టులో రుణమాఫీ చేయాలన్న టార్గెట్ పెట్టుకున్న ప్రభుత్వం ఆ దిశగా కార్యచరణ వేగవంతం చేసింది. ఓవైపు నిధుల సమీకరణ చేస్తూనే... మరోవైపు అర్హులను తేల్చే పనిలో పడింది. ఇప్పటికే దీనిపై అధికారులు ఓ కార్యచరణ సిద్ధం చేశారని తెలుస్తోంది. వీటిపై నిర్ణయం తీసుకునేందుకు 21 రాష్ట్ర మంత్రి మండలి సమావేశం కానుంది. 21న జరిగే తెలంగాణ మంత్రిమండలి భేటీలో ముఖ్య అంశంగా రుణమాఫీ ఉంటుందని అంటున్నారు. ఈ విషయంపై సుదీర్ఘంగా చర్చించి కీలకమైన నిర్ణయం తీసుకోనున్నారు. ఎవరెవరికి రుణమాఫీ చేయాలి, నిధుల సమీకరణకు ఏం చేయాలనే విషయంపై కూలంకుశంగా చర్చించనున్నారు. ప్రస్తుతం ఇదే అంశంపై రేవంత్ సర్కార్ ప్రధానంగా ఫోకస్ పెట్టింది.ఏకకాలంలో రైతుల రుణమాఫీ ఎలా చేయాలనే దానిపై అనేక మార్గాలను అన్వేషిస్తోంది. అధికారుల నుంచి పలు ప్రతిపాదనలను కూడా స్వీకరిస్తూ? మల్లగుల్లాలు పడుతోంది. ఇచ్చిన హామీ ప్రకారం?. రుణమాఫీ ప్రక్రియను షురూ చేయాలనే పట్టుదలతో ప్రభుత్వం ఉందిఇటీవలే రైతుల రుణమాఫీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షించారు. ఈ ప్రక్రియ అమలు కోసం అవసరమైతే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు నిధులు ఇచ్చేందుకు ముందుకొచ్చే బ్యాంకర్లతో సంప్రదింపులు జరపాలని అధికారులకు సూచించారు. ఈ విషయంలో మహారాష్ట్ర, రాజస్థాన్, ఇతర రాష్ట్రాల్లో అనుసరించిన విధానాలను అధ్యయనం చేయాలని కూడా చెప్పారు.ఇదిలా ఉంటే? రైతుల రుణమాఫీ విషయంలో కీలక ప్రతిపాదనలు తెరపైకి వస్తున్నాయి. ముఖ్యంగా అర్హులు ఎవరు అనే దానిపై సర్కార్ దృష్టిపెట్టింది. ఈ విషయంలో లోతుగా కసరత్తు చేసి? అర్హత ఉన్నవారికి మాత్రమే స్కీమ్ ను వర్తింపచేయాలని భావిస్తోంది.పంట రుణాల మాఫీ అమలుకు విధివిధానాలపై తెలంగాణ సర్కార్ కసరత్తు చేస్తోంది. అధికారుల నుంచి వచ్చిన పలు ప్రతిపాదనల్లో కొన్నింటిని పరిగణనలోకి తీసుకునే విషయంపై సర్కార్ ఆలోచించింది.రుణమాఫీ స్కీమ్ కు అర్హత పొందే లబ్ధిదారుడికి తప్పనిసరిగా పాస్ బుక్ ఉండటంతో పాటు రేషన్ కార్డును కూడా ప్రామాణికంగా తీసుకోవాలని ఆలోచిస్తుందంట..! దాదాపు రాష్ట్రంలో రుణమాఫీ స్కీమ్ కోసం 60 లక్షల మందికిపైగా రైతులు ఎదురుచూస్తున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే వీరిలో చాలా మందికి పాస్ బుక్ లు లేవు. వీరికి వర్తింపజేయాలా లేదా అనేది కేబినెట్ భేటీలో చర్చించే అవకాశం ఉంది.జులై17 రుణమాఫీ ప్రక్రియ ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు వార్తలు వస్తున్నాయి. జులై నుంచే వ్యవసాయ పనులు ఊపందుకోనున్నాయని అప్పటి నుంచి రుణాలు మాఫీ చేస్తే రైతులకు మేలు జరుగుతుందని భావిస్తున్నారట. జులై మధ్యలో రుణమాఫీ ప్రక్రియను ప్రారంభించి.. ఆగస్టు 15 కల్లా పూర్తి చేయనున్నారు. పీఎం కిసాన్ పథకంలో ఉన్న రూల్స్ ప్రకారమే మొత్తం మూడు విడతల్లో అప్పులు తీర్చేయనున్నారని టాక్. పీఎం కిసాన్ సమ్మాన్ పథకం ప్రజాప్రతినిధులు, ఐటీ కడుతున్న వాళ్లకు, ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించడం లేదు. ఇప్పుడు రుణమాఫీ కూడా వారి వచ్చే ఛాన్స్ లేదంటున్నారు. ఇదే కాకుండా? రేషన్ కార్డును కూడా ప్రమాణికంగా తీసుకోవాలనే అంశం కూడా తెరపైకి వచ్చింది. ఒకే కుటుంబానికి చెందిన పలువురికి రైతుబంధు వస్తుండగా? వారందరికీ ప్రత్యేకంగా రేషన్ కార్డులు లేవు. కేవలం వారి కుటుంబ పెద్ద పేరు మీదనే కార్డు ఉంటోంది. ఫలితంగా ఈ నిబంధను వర్తింపజేస్తే?. కుటుంబ పెద్ద మాత్రమే ఈ స్కీమ్ వర్తింపజేసే అవకాశం ఉంది. అధికారుల నుంచి ఈ ప్రతిపాదన రాగా.. సర్కార్ నిర్ణయం ఎలా ఉండబోతుందనేది చూడాలి..ఇక ఆదాయపు పన్ను చెల్లించే వారిని పూర్తిగా పక్కనపెట్టే అవకాశం ఉంది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కిసాన్ సమ్మాన్ నిధి స్కీమ్ మార్గదర్శకాలను ప్రభుత్వం ప్రధానంగా పరిశీలిస్తోంది. ఈ స్కీమ్ లో కింద అర్హులైన రైతులందరికీ ప్రతి ఏడాది రూ.6 వేల పంట పెట్టుబడి సాయం అందిస్తోంది. అయితే ఈ స్కీమ్ ప్రభుత్వ ఉద్యోగులతో పాటు పన్నులు చెల్లించే వారికి వర్తించదు. కేవలం రైతులకు మాత్రం వర్తిస్తుంది. ఇక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంలో పలు పదవుల్లో ఉండే వారిని కూడా ఈ స్కీమ్ ను మినహాయించారు. వీటితో పాటు మరికొన్ని మార్గదర్శకాలు కూడా ఈ స్కీమ్ కు సంబంధించి ఉన్నాయి.

# మేయర్ గుండు సుధారాణికి అవిశ్వాస గండం

**వరంగల్:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గుండు సుధారాణికి అవిశ్వాస గండం పొంచి ఉంది. ఆమెను గద్దె దించాలని గతం నుంచే ప్రయత్నాలు చేస్తుండగా, మంగళవారం బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు మున్సిపల్ కౌన్సిల్ హాలులోనే సమావేశం పెట్టుకున్నారు.ప్రస్తుతం గుండు సుధారాణి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతుండగా, ఆ ఒక్క పార్టీకి చెందిన కార్పొరేటర్లు మినహా మిగతా బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు సమావేశమై అవిశ్వాస నిర్ణయం తీసుకోగా, వరంగల్ నగరంలో ఇప్పుడిదే హాట్ టాపిక్ గా మారింది. ఇదిలాఉంటే పదవీ గండం పొంచి ఉందనే ఉద్దేశంతోనే గులాబీ పార్టీ నుంచి కాంగ్రెస్ లోకి ఎంట్రీ ఇచ్చిన సుధారాణికి ఇప్పుడు ఆమె అంటే గిట్టని కార్పొరేటర్లతో అవిశ్వాస ముప్పు పొంచి ఉండటంతో మేయర్ కాస్త ఆందోళనలో పడినట్లు తెలుస్తోంది.గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి 2021 ఏప్రిల్ లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున 29వ డివిజన్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. అనంతరం గులాబీ పార్టీ పెద్దల సహకారంతో అనూహ్యంగా మేయర్ పీఠాన్ని దక్కించుకున్నారు. దీంతో బీఆర్ఎస్ నుంచి మేయర్ పదవిని ఆశించిన మిగతా కార్పొరేటర్లంతా తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. అప్పటినుంచి ఆమె తీరుపై అసహనంతోనే కొనసాగుతున్నారు.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల తరువాత ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ అడ్రస్ గల్లంతవగా, కొంతమంది కార్పొరేటర్లు కూడా కండువాలు మార్చారు. బీఆర్ఎస్ లో మేయర్ తీరు నచ్చక కాంగ్రెస్ లో చేరారు. దీంతో గ్రేటర్ బీఆర్ఎస్ బలహీన పడగా, మేయర్ కూడా సెల్ఫ్ డిఫెన్స్ లో పడ్డారు. కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లతో తన పదవికి గండం పొంచి ఉందనే ఆలోచనతో నాటకీయ పరిణామాల నడుమ సుధారాణి కూడా హస్తం గూటికి చేరారు.దీంతో ఆమె తీరు నచ్చక కాంగ్రెస్ లో చేరిన కార్పొరేటర్లు మేయర్ హస్తం పార్టీలోకి రావడాన్ని వ్యతిరేకించారు. కానీ అధిష్ఠానం ఆమెను పార్టీలో చేర్చుకోగా.. పార్టీ మారిన మేయర్ పీడ తప్పలేదనే భావనతో కొందరు కాంగ్రెస్ కార్పొరేటర్లు కూడా ఆమెపై అసంతృప్తితో రగులుతున్నారు.గ్రేటర్ వరంగల్ లో మొత్తంగా 66 మంది కార్పొరేటర్లు ఉండగా, ఆమెపై అప్పుడు బీఆర్ఎస్ లో ఇప్పుడు కాంగ్రెస్ లో గుర్రుగా ఉన్న కార్పొరేటర్ల సంఖ్య ఎక్కువగానే ఉంది. ఈ రెండు పార్టీలకు తోడు బీజేపీ కార్పొరేటర్లు కూడా ఆమెను గద్దె దించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో ఉన్న మూడు పార్టీల కార్పొరేటర్లలో మెజారిటీ సభ్యులకు గుండు సుధారాణి మేయర్ గా కొనసాగడం ఇష్టం లేదనే విషయం స్పష్టమవుతోంది.గ్రేటర్‌లో మొత్తం 66 డివిజన్లు ఉండగా, అందులో కాంగ్రెస్ కు 35 మంది సభ్యుల బలం ఉండగా, బీఆర్ఎస్ 22, బీజేపీకి 9 మంది సభ్యుల బలం ఉంది. కాగా అవిశ్వాసం కోసం పాలకవర్గంలోని సగానికంటే ఎక్కువ మంది కార్పొరేటర్లు సంతకం పెట్టాల్సి ఉంటుంది. కానీ అవిశ్వాస తీర్మాన నోటీసులు ఇవ్వాలంటే సొంతంగా బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు సంఖ్యా బలం లేదు. దీంతోనే కాంగ్రెస్ పార్టీలోని కొందరు కార్పొరేటర్లను కూడా కలుపుకొని అవిశ్వాస తీర్మానం పెట్టాలనే యోచనలో కొందరు కార్పొరేటర్లున్నారు.ఎలాగైనా గుండు సుధారాణిని దించడంతో పాటు ఆ పదవిని దక్కించుకోవాలన్న ఆశతో ఉన్న కొందరు కార్పొరేటర్లు అవిశ్వాసానికి పావులు కదుపుతున్నట్లు తెలిసింది. ఈ మేరకు మంగళవారం మధ్యాహ్నం బీఆర్ఎస్, బీజేపీకి చెందిన దాదాపు 8 మంది కార్పొరేటర్లు అందరి ముందు బహిరంగంగానే సమావేశం అయ్యారు.

తమకు ఉన్న బలంతో పాటు కలిసి వచ్చే కార్పొరేటర్లను కలుపుకుని తొందర్లోనే అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన లెటర్ అధికారులకు అందించనున్నట్లు తెలిసింది.అందులో మేయర్ తో పాటు డిప్యూటీ మేయర్ ను కూడా ఆ పదవి నుంచి తప్పించాలనే ప్రయత్నం జరుగుతున్నట్లు తెలిసింది.

ఈ నెల 20వ తేదీన సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు సెక్రటరీ విజయలక్ష్మి ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేయగా, అదే సమావేశంలో కార్పొరేటర్లంతా కలిసి కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలిసింది. ఇప్పటికే మేయర్ గుండు సుధారాణి పదవీ గండంతో గందరగోళంలో పడగా, రెండు, మూడు రోజుల్లో గ్రేటర్ రాజకీయాల్లో కీలక మార్పులు చోటు చేసుకుంటాయోననే చర్చ జరుగుతోంది.

# ఆర్టీసీ ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్‌లో అవకతవకలు

**హైదరాబాద్ :** టీజీఎస్ఆర్టీసీ ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ విధానంలో నిబంధనలు పాటించలేదని బీఆర్ఎస్ ఆరోపించింది. టెండర్లు పిలవకుండా కోట్లాది రూపాయల కాంట్రాక్ట్ ను ఓ కంపెనీకి కట్టబెట్టారని బీఆర్ఎస్ ఆరోపించింది. దీనిపై టీజీఎస్ఆర్టీసీ వివరణ ఇచ్చింది. అయితే తాజాగా టీజీఎస్ఆర్టీసీ వివరణపై బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ మరోసారి లేఖ రాశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టమ్ కోసం ఏ టెండర్ లేకుండా ఓ కంపెనీకి కట్టబెట్టారనడానికి టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం విడుదల చేసిన వివరణతో స్పష్టం అవుతుందని ఆరోపించారు.ప్రభుత్వ కమిటీ మార్చి 4న చర్చలు జరిపిందని లెటర్ ఆఫ్ ఇంటెంట్ స్పష్టంగా పేర్కొందని, అయితే ఫిబ్రవరి 29న మునుపటి టెండర్‌ను రద్దు చేసినట్లు ప్రభుత్వం పత్రికా ప్రకటన పేర్కొంది. ఆ తర్వాత టీజీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారుల బృందం దేశంలోని వివిధ రాష్ట్రాలకు వెళ్లి, ప్రభుత్వ అధికారులను కలిశారు. ఇతర రాష్ట్రాల్లోని అధికారులు, వారి అభిప్రాయాలను తీసుకుని, సాంకేతిక నైపుణ్యం, నాణ్యత, కార్యకలాపాలు, ఆర్థిక ఇతర అంశాలను అధ్యయనం చేసి, ఆపై చలో మొబిలిటీకి అనుమతి ఇచ్చారు. టీజీఎస్ఆర్టీసీ ప్రతినిధి బృందం కేవలం 3 రోజుల్లో అధ్యయనం ఎలా ముగించగలరు, వారు ఎన్ని రాష్ట్రాల్లో పర్యటించారు? ప్రతినిధి బృందంలోని సభ్యులు ఎవరు, వారు ఎన్ని రాష్ట్రాల్లో పర్యటించారు, వారు ఏ అధికారులను కలిశారు, 2022లో ఇచ్చిన కాంట్రాక్ట్‌ను 2023లో రద్దు చేశారు. కానీ రద్దు చేసిన తర్వాత కేవలం 3 రోజుల్లో మరో నిర్ణయం తీసుకున్నారు. ఈ కాంట్రాక్టును ఫలానా కంపెనీకి గిఫ్ట్ గా ఇవ్వాలనే ఉద్దేశం ప్రభుత్వానికి ముందుగానే ఉందనే అనుమానం వస్తుంది" అని బీఆర్ఎస్ ప్రశ్నించింది.టీజీఎస్ఆర్టీసీ ప్రెస్ నోట్ ప్రకారం ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టమ్ కోసం 2022లో 6 కంపెనీలు పోటీ పడ్డాయి, 2024లో కేవలం 3 కంపెనీలు మాత్రమే పోటీ పడ్డాయి, ఆ కంపెనీలు ఏవి? చలో మొబిలిటీ బిడ్డింగ్‌లో పాల్గొందా? ప్రభుత్వ నోట్‌లో పేర్కొన్న విధంగా ఏ కంపెనీ అవసరాలను తీర్చకపోతే, సాధారణంగా పేరున్న కంపెనీలు టేబుల్‌పై చర్చలు జరపడానికి ఇష్టపడవు. అప్పుడు ఆన్‌లైన్ టెండర్లకు ప్రాధాన్యత ఇవ్వకూడదు, గ్లోబల్ టెండర్లను ఎందుకు పిలవలేదు? టెండర్లు, కొనుగోళ్లకు ప్రముఖమైన టీఎస్టీఎస్(తెలంగాణ స్టేట్ టెక్నికల్ సర్వీస్) ఎందుకు ఉపయోగించలేదు? బస్ స్టాల్స్‌లో షెడ్‌ల నిర్మాణాలు, బస్ డిపోల్లోని స్టాల్స్ వంటి తక్కువ మొత్తాలకు కాంట్రాక్టులు ఆన్‌లైన్‌లో ఉంచుతున్నప్పుడు, కోట్లాది రూపాయల విలువైన కాంట్రాక్టును ఆన్‌లైన్ ఈ ప్రొక్యూర్‌మెంట్ విధానంలో పారదర్శకంగా ఎందుకు చేయలేదు?" అని బీఆర్ఎస్ ప్రశ్నించిందిటీజీఎస్ఆర్టీసీ ప్రెస్ నోట్‌లో రాష్ట్ర ప్రభుత్వం లేదా రవాణా మంత్రికి ఎటువంటి పాత్ర లేదని పేర్కొంటూ రవాణా మంత్రిని రక్షించే ప్రయత్నం ఉంది. టీజీఎస్ఆర్టీసీ ఒక కమిషన్ కాదు, ఇది ప్రభుత్వంలో విలీనం చేసిన కార్పొరేషన్. ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ నుంచి బ్యూరోక్రాట్‌లు కూడా బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లుగా ఉన్నారని గమనించాలి. రాష్ట్ర ప్రభుత్వానికి లేదా రవాణా మంత్రికి సంబంధం లేదని మీరు చెబితే, ఇంత పెద్ద కాంట్రాక్ట్ బోర్డుకు తెలియకుండా ఉంచారా అనే అనుమానం వస్తుంది" అని బీఆర్ఎస్ అభిప్రాయపడింది.మహాలక్ష్మి పథకం పన్ను చెల్లింపుదారుల డబ్బుతో పనిచేస్తోంది, పురుష ప్రయాణికులు టికెట్లు కొనుగోలు చేయడంతో కొనసాగిస్తున్నారు. మహాలక్ష్మి పథకం ముసుగులో ప్రభుత్వం ఒక నిర్దిష్ట కంపెనీకి లబ్ధి చేకూర్చడం ద్వారా బహిరంగంగా స్కామ్ చేస్తుంది. కర్ణాటక ప్రభుత్వం అదే మహాలక్ష్మి పథకం కోసం శక్తి స్మార్ట్ కార్డ్‌లను జారీ చేసింది. వాళ్లు ఈ-గవర్నెన్స్ పోర్టల్ ద్వారా టెండర్ ప్రక్రియను కూడా నిర్వహించారు. దానిని అధ్యయనం కోసం ఎందుకు పరిగణించలేదు. హైదరాబాద్ మెట్రో ఇప్పటికే యూపీఐ, స్మార్ట్ కార్డ్ సేవలతో ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టమ్‌ని ఉపయోగిస్తోందని తెలియకపోవడం ఆశ్చర్యం కలుగుతుంది. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు జీరో టిక్కెట్‌ను జారీ చేస్తారు. అయితే కంపెనీ దాని కమిషన్‌ను పొందుతుంది. అందుకే ఒప్పందంలో మహాలక్ష్మి ప్రయాణికులతో పాటు పురుషులు కొనుగోలు చేసిన టికెట్లతో 30 లక్షల టికెట్ లావాదేవీలను పేర్కొన్నారు.

మహిళా పథకంలో అవినీతి జరగకుండా పారదర్శకత పాటించడం ప్రభుత్వ బాధ్యత.కాంగ్రెస్ ప్రభుత్వం తరఫున మొత్తం ప్రెస్ నోట్ కొన్ని ప్రయోజనాలకు అనుకూలంగా వ్యత్యాసాలు, నిబంధనల ఉల్లంఘనలను వివరిస్తుంది. నోట్ షీట్/కాంట్రాక్ట్ ఫైల్ నిర్దిష్ట పత్రాలు, బిడ్డర్లు వారి కొటేషన్లు, అన్ని వివరాలు, ఉన్నత స్థాయి కమిటీ నివేదికలు, కమిటీ సభ్యుల పేరు, హోదా, మార్చిలో కార్పొరేషన్ నిర్వహించిన వివిధ అధ్యయన నివేదికలను వీక్షించడానికి బీఆర్ఎస్ ప్రతినిధి బృందాన్ని అనుమతించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని క్రిశాంక్ అన్నారు.ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టం అమలు విషయంలో చేస్తోన్న ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదని టీజీఎస్ఆర్టీసీ పేర్కొంది. ఉన్నతస్థాయి కమిటీ సిఫారసు మేరకు బోర్డు అనుమతితోనే ఈ వ్యవస్థను సంస్థ అమలు చేస్తుందని తెలిపింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారించిందని చేస్తోన్న నిరాధారమైన ఆరోపణలను టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం ఖండిస్తోందని తెలిపింది. నియమ నిబంధనలకు లోబడి బోర్డు అనుమతితోనే సంస్థలో నిర్ణయాలు తీసుకుంటుందని స్పష్టం చేస్తోంది.

## విద్యుత్ కోనుగోళ్లలో తిరకాసులు

**హైదరాబాద్ :** విద్యుత్ కొనుగోళ్లలో డిస్కంలకు జరిగిన నష్టం అక్షరాలా 85 వేల కోట్లు.. ఇదే లెక్కను విద్యుత్ సంస్థల అధికారులు సీఎం రేవంత్ రెడ్డికి చెప్పారుఅయితే ఇన్ని వేల కోట్ల భారం ఎందుకు పడింది? మొన్న సీఎం కేసీఆర్ ఏం చెప్పారో గుర్తుందా? తెలంగాణ సర్కార్ విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకొని ఒక్కో యూనిట్‌ను 3 రూపాయల 90 పైసలకే కొనుగోలు చేసిందన్నారు. కాని చివరకు కరెంట్ సరఫరా అయ్యే సరికి ఆ ధర కాస్త 5 రూపాయల 64 పైసలకు పెరిగింది. దీంతో 3 వేల 110 కోట్ల అదనపు భారం పడింది. అది కూడా ఎప్పుడో ఒప్పందం చేసుకుంటే.. 2017 ఆఖర్లో సరఫరా ప్రారంభమైంది. మరి అదైనా ఒప్పందంలో ఉన్నట్టు వెయ్యి మెగావాట్లు సరఫరా అయ్యిందా అంటే అదీ లేదు. దీంతో 2017 నుంచి 2022 మధ్య కాలంలో మళ్లీ 2 వేల 83 కోట్లు చెల్లించి బహిరంగ మార్కెట్లో కొనాల్సి వచ్చింది. ఈ దారుణం ఇక్కడితో ఆగిందా లేదు.. ఇంకేం జరిగిందో మీరే చూడండి.ఇది ఒప్పందం లెక్కలు.. ఇక యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్లాంట్ల విషయానికి వద్దాం.. భద్రాద్రి పవర్ ప్లాంట్ గురించి కేసీఆర్ ఏం చెప్పారు. అప్పటికప్పుడు మనకు విద్యుత్ తయారీ అత్యవసరం. అందుకే ప్రభుత్వ రంగ సంస్థ ఃఊఇఒతో ఒప్పందం చేసుకున్నాం.. వేగంగా విద్యత్ ఉత్పత్తి కోసమే సబ్ క్రిటికల్ టెక్నాలజీతో పవర్ ప్లాంట్‌ను నిర్మించామన్నారు. కాని.. ఈ వ్యాఖ్యల వెనక కూడా తిరకాసు ఉంది. అసలు గోదావరి నది ఒడ్డునే పవర్ ప్లాంట్ల నిర్మాణంతో ఇప్పుడు మరో పెద్ద నష్టం ఎదురుకాబోతుందని తెలుస్తుంది.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న అనాలోచిత నిర్ణయాల కారణంగా.. ప్రజల నెత్తిన వేల కోట్ల అప్పుల భారం పడినట్టు క్లియర్ కట్‌గా అర్థమవుతోంది.కేసీఆర్ చెప్పినవన్ని కల్లబొల్లి మాటలే అని దీన్ని బట్టి అర్థమవుతోంది. అనాలోచిత నిర్ణయాలు.. ఏకపక్ష నిర్ణయాలు.. ఇవే బీఆర్ఎస్ హయాంలో జరిగిందని తెలుస్తుంది. పేరు కోసం ప్రజల నెత్తిన అప్పులను రుద్దినట్టు అర్థమవుతోంది. ఇప్పటికే కమిషన్ విచారణను స్పీడప్ చేసింది. అన్ని వర్గాల నుంచి సమాచారాన్ని సేకరిస్తుంది. అధికారులను విచారిస్తోంది. సో.. వెరీ సూన్ కమిషన్ తన తుది నివేదికను సిద్ధం చేయడం ఖాయంగా కనిపిస్తోంది.ఇప్పటి వరకు విచారణలో పాల్గొన్నవారు.

## ఏపీ డీజీపీగా ద్వారకా తిరుమలరావు



**అమరావతి** 1989 ఐపీఎస్ బ్యాచ్కు చెందిన ద్వారకా తిరుమల రావును నూతన డీజీపీగా ఏపీ ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ద్వారకా తిరుమలరావు ఏపీఎస్ ఆర్టీసీ ఎండీగా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఏపీ డీజీపీగా ఉన్న హరీష్ గుప్తాను మళ్లీ హోం సెక్రటరీగా ప్రభుత్వం బదిలీ చేసింది.

## అభివృద్ధి పనులు ఆగకూడదు

**రంగారెడ్డి** కూకట్పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అధికారులతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమావేశం నిర్వహించారు. అధికారులతో మాట్లాడుతూ గత ఆరు నెలలుగా ఎలాంటి అభివృద్ధి జరగకుండా పెండింగ్లో ఉన్న పనులను సైతం పట్టించుకోకుండా అధికారులు వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా వేల కోట్ల రూపాయలతో కూకట్పల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని అభివృద్ధిలో ఎలాంటి ఆటంకాలు జరగకుండా అందరి సహకారంతో ట్రాఫిక్ సమస్యలను డ్రైనేజీ సమస్యలను మంచినీటి సమస్యలను నిర్మూలించామన్నారు.ప్రభుత్వం మారిన ఆరు నెలల్లో ఎలాంటి అభివృద్ధి పనులు జరగకపోగా గత సంవత్సరంలో 65 కోట్ల రూపాయలతో రోడ్లు డ్రైనేజీ మంచినీటి పైప్లైన్ లకు శంకుస్థాపనలు చేసి టెండర్లు జరిగిన అలాంటి పనులను పక్కన పెడుతున్నారని జిహెచ్ఎంసి అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి కొరకు ఎక్కడికి వెళ్లడానికైనా వెనకాడననితి అభివృద్ధి కోసం పని చేస్తామన్నారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఇంట్లో ఈడీ సోదాలు



**సంగారెడ్డి** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువులో బీఆర్ఎస్ ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఇంట్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. దీంతో, తీవ్ర కలకలం చోటుచేసుకుంది.కాగా, ఈడీ అధికారులు ఏక కాలంలో గురువారం తెల్లవారుజాము నుంచే పటాన్చెరు నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఇంట్లో సోదాలు చేపట్టారు. అలాగే, ఆయన సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి ఇంట్లో కూడా తనిఖీలు చేపట్టారు. ఈడీ సోదాల విషయం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. అయితే, ఇద్దరు సోదరులు మైనింగ్, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఇటీవలి కాలంలో ఓ కేసులో గూడెం మధు అరెస్ట్ అయిన విషయం తెలిసిందే.నిజాంపేటలోని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఇంట్లో కూడా అధికారులు సోదాలు చేస్తున్నారు. ఇక, గతంలో లక్డారం గనుల వ్యవహారంలో పోలీసు స్టేషన్లో కేసు నమోదు అయ్యింది. ఈ కేసు ఆధారంగానే ఈడీ సోదాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇక, తాజా సోదాల గురించి మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

## సికింద్రాబాద్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు





**సికంద్రాబాద్** సికింద్రాబాద్ లోని ఆల్ఫా హోటల్, సందర్శిని హోటల్, రాజ్ బార్ అండ్ రెస్టారెంట్ లో ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ అధికారులు తనిఖీలు చేసారు. చాలా కాలంగా ఫ్రిడ్జ్ లోనే నిల్వ ఉంచిన మటన్ మాంసాహార ముడి పదార్థాలను గుర్తించారు. ఆల్ఫా బ్రాండ్ ఐస్ క్రీమ్, బ్రెడ్ ప్యాకెట్లపై డేట్ లేకుండా కస్టమర్లకు విక్రయిస్తున్నట్లుగా గుర్తించారు. నిబంధనలు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఆల్ఫా హోటల్ పై కేసు నమోదు చేసారు. రాజ్ బార్ అండ్ రెస్టారెంట్ కిచెన్ అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించారు. రాజ్ బార్ అండ్ రెస్టారెంట్ సింథటిక్ ఫుడ్ కలర్స్ ఉపయోగిస్తున్నారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్ వ్యాలిడిటీ ముగిసినట్లు గుర్తించారు.

## నులిపురుగుల నివారణ అందరి బాధ్యత

### - మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి

**జగిత్యాల :** నులిపురుగుల నివారణ అందరి బాధ్యత అని జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి- లక్ష్మణ్ అన్నారు. గురువారం పట్టణంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో చైర్ పర్సన్ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు ..ఈ సందర్భంగా ఆమెమాట్లాడారు విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణిస్తారని తెలిపారు. నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను ప్రతీ విద్యార్థికి తప్పనిసరిగా వేయాలన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం తోపాటు చుట్టూ ఉన్న వారినిసైతం పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ సమియోద్దిన్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇక రైతు భరోసా అందరికీ రాదు

అర్హత గల రైతులకు మాత్రమే సాయం అందేలా పకడ్బంధీ విధివిధాలను రూపొందించే పనిలో ప్రభుత్వం నిమగ్నమై ఉంది. పంట పెట్టుబడి సాయం కోసం ప్రతి ఎకరాకు రూ. 15 వేలు అందజేస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఎన్నికల్లో గెలిచి అధికారం చేపట్టిన తర్వాత ఈ ఖరీఫ్ సీజన్ నుంచి పంట పెట్టుబడి సాయం అందజేస్తామని ప్రభుత్వం చెబుతోంది. అయితే గతంలో రైతుబంధు పథకం కింద ప్రతి రైతుకు ఎకరాకు రూ. 10 వేల ఆర్థిక సాయం అందించేవారు. ఇదే పథకాన్ని రైతు భరోసాగా పేరుమార్చి ఎకరాకు రూ. 15 వేలు రెండు విడతల్లో జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

### అప్పట్లో ఎలాంటి పరిమితుల్లేవు

గత కేసీఆర్ సర్కార్ హయాంలో రైతుబంధు పథకానికి ఎలాంటి పరిమితులు లేవు. రైతు పేరు మీద ఎన్ని ఎకరాల భూమి ఉంటే అన్ని ఎకరాలకు పంట పెట్టుబడి సాయం అందింది. ఎకరానికి ఏటా రెండు విడతల్లో కలిపి రూ. 10 వేలు సాయాన్ని రైతుల ఖాతాల్లో బీఆర్ఎస్ సర్కార్ జమ చేసింది. అయితే నిజమైన రైతులు కాని వారికి కూడా రైతు బంధు సాయం అందిందన్న విమర్శలు వచ్చాయి. అలాగే వందలాది ఎకరాలు ఉన్న వాళ్లు, అసలు వ్యవసాయమే చేయని వాళ్లు, కోటీశ్వరులు, ఇన్ కమ్ ట్యాక్స్ కట్టేవారికి రైతు బంధు సాయం అందించడం ఏంటన్న ప్రశ్నలు తలెత్తాయి. రియల్ ఎస్టేట్ భూములు, కొండలు, గుట్టలు, పడావు భూములకు కూడా రైతుబంధు అందిందనే ఆరోపణలు వచ్చాయి.

### తగ్గనున్న ఆర్థిక భారం

దీంతో ఈసారి ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని చూస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వం రైతుబంధు పథకానికి పరిమితి విధించాలని యోచిస్తోంది. దీని ద్వారా అసలైన లబ్ధిదారులకు సాయం అందించడమే కాకుండా ప్రభుత్వంపై ఆర్థిక భారం తగ్గనుంది. కోటీశ్వరులు, ఆదాయ పన్ను కట్టే వారికి రైతుబంధు ఇవ్వబోమని ప్రభుత్వం ఇప్పటికే తేల్చి చెప్పింది. అలాగే సాగు చేసే భూములకు మాత్రమే రైతు బంధు ఇవ్వాలని భావిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అంటే వ్యవసాయం చేసే నిజమైన రైతులకు మాత్రమే రైతు భరోసాను ప్రభుత్వం అందిస్తుంది. కొండలు, గుట్టలు, పడావు భూవులు, రియల్ ఎస్టేట్ ప్లాట్లు ఉన్న వారికి పంటపెట్టుబడి సాయాన్ని నిలిపి వేయనుంది.

### నేడు మంత్రి వర్గ సమావేశం

రైతు బంధును ఐదు ఎకరాల వరకే పరిమితం చేయాలా? లేదా 10 ఎకరాల వరకు అందించాలా? అనే విషయంపై ప్రభుత్వం తీవ్ర కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. నేడు జరిగే మంత్రివర్గ సమావేశంలో రైతు రుణమాఫీతో పాటు రైతు భరోసా పథకంపై చర్చించి ఓ నిర్ణయానికి రానున్నట్లు తెలుస్తోంది. అంతిమ నిర్ణయం తర్వాత త్వరలోనే అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులందరూ పంట పెట్టుబడి కోసం ఎదురుచూస్తున్నారు. దీంతో వీలైనంత త్వరగా విధివిధానాలు ఖరారు చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 69 లక్షల మంది రైతులు ఉన్నారు. వీరి వద్ద 1.53 కోట్ల ఎకరాల భూమి ఉంది. వీరిలో 5 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులు 64.75లక్షల మంది ఉన్నారు. ఇది ఇలా ఉంటే ప్రభుత్వం రైతు బంధుకు సీలింగ్ విధిస్తుందన్న వార్త నేపథ్యంలో పెద్ద మొత్తంలో భూములు ఉన్న వాళ్లు తమ కుటుంబ సభ్యుల పేరు మీద భూములు రిజిస్ట్రేషన్ చేయిస్తున్నట్లు తెలుస్తోంది.

# ఏపీ అంటే అమరావతి పోలవరం

చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అపార నమ్మకంతో ఆ పోరాటాన్ని విరమించారు. రైతులందరికీ మనస్ఫూర్తిగా నమస్కారాలు.' అని చంద్రబాబు అన్నారు.

### అమరావతిపై వైట్ పేపర్

అమరావతిపై త్వరలో శ్వేతపత్రం విడుదల చేస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. వైసీపీ హయాంలో ఎక్కడ వేసిన మట్టి అకక్డే ఉండిపోయిందని.. కనీసం 80 శాతం పూర్తైన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్స్ కూడా పూర్తి చేయలేదని మండిపడ్డారు. ఎన్నో పవిత్ర ప్రాంతాల నుంచి మట్టి, నీరు తెచ్చి అమరావతి శంకుస్థాపన చేశామని ఈ స్థల మహత్యమే అమరావతిని కాపాడిందని అన్నారు. ఐదేళ్లలో అమరావతికి భూములిచ్చిన రైతులను ఎన్నో ఇబ్బందులకు గురి చేశారని అన్నారు.

### పోలవరం రాష్టానికి వరం

పోలవరం రాష్ట్రానికి వరమని.. కానీ వైసీపీ పాలనలో పోలవరం అది శాపంగా మారిందని చంద్రబాబు విమర్శించారు. 'పోలవరం పూర్తైతే రాయలసీమ రతనాల సీమగా మారుతుంది. వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్టును గోదారిలో కలిపేసింది. కేంద్ర నిధులతో పోలవరాన్ని కట్టి, నదుల అనుసంధానం వంటి విధానాలు, ఇక్కడి నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటే సాగునీటి రంగానికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. పోలవరం సందర్శించాక చాలా బాధేస్తోంది. జగన్ పాలన ప్రజావేదిక కూల్చివేతతోనే ప్రారంభమైంది. వైసీపీ పాలనలో అమరావతిలోని నమూనాలను కొన్ని అల్లరిమూకలు ధ్వంసం చేశాయి. ఇక్కడి రైతులు వాటిని కాపాడుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేశారు. పైపులు, రోడ్డు, మట్టిని దొంగతనం చేస్తున్నా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఎక్కడ కట్టిన బిల్డింగులు అక్కడే ఉన్నాయి. ఐకానిక్ కట్టడాలన్నీ అలానే నిలిచిపోయాయి. ఐఏఎస్, ఐపీఎస్ భవనాలు, అసెంబ్లీ బిల్డింగ్ ఉండాల్సిన చోట తుమ్మచెట్లు మొలిచాయి. కేంద్ర ప్రోత్సాహంతో రాష్ట్రంలోని 11 కేంద్రీయ విద్యా సంస్థలు ఏర్పాటు చేశాం. అన్ని ప్రాంతాల అభివృద్ధికి స్పష్టమైన విధానం ప్రకటించాం.' అని వివరించారు.

### 3 ముక్కలాట ఆడారు

'వైసీపీ ప్రభుత్వం 3 రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడింది. అమరావతి బ్రాండ్ దెబ్బతీయాలని చూశారు. విషం చిమ్మి సింగపూర్ కన్సార్టియం తరిమేశారు. స్వచ్ఛందంగా రైతులు భూములిస్తే ఎన్నో అవమానాలకు గురి చేశారు. రాజధాని ఏదీ అని చెప్పుకోలేని దుస్థితికి తీసుకొచ్చారు. తెలుగుజాతి గర్వంగా తలెత్తుకునేలా రాజధాని నిర్మాణం ఉండాలి. కర్నూలును ఆధునిక నగరంగా తయారుచేయాలి. రుషికొండను నాశనం చేశారు. ఎన్నో అప్పులు చేశారు. ఖజానా మొత్తం ఖాళీ అయ్యింది. గత సీఎంలు అభివృద్ధి చేశారు. జగన్‌లా ఎవరూ చేయలేదు.' అని సీఎం చంద్రబాబు వైసీపీ ప్రభుత్వం, జగన్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

# 16 సీట్లతో టీడీపీ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపగలిగింది

ప్రయివేటీకరణ ఆగిపోయింది. ఇప్పుడు కాంగ్రెస్, బీజేపీ కలిసి సింగరేణిని ఖతం చేసే ప్రయత్నం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 8 స్థానాలు గెలిచిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు సింగరేణి బొగ్గు గనులను ప్రైవేట్ పరం చేస్తున్నాయని మండిపడ్డారు.

ఉద్దేశ పూర్వకంగా సింగరేణికి కోల్ బ్లాక్స్ కేటాయించడం లేదని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి బొగ్గు గనుల యాక్షన్‌ను ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రశ్నించారు. 16ఎంపీల పవర్ ఏంటో ఏపీని చూస్తే తెలుస్తుందని ఉద్ఘాటించారు.

రేవంత్ ఎందుకు ఆపడం లేదు. కేసుల భయమా? అని ఎద్దేవా చేశారు. సింగరేణి మెడ మీద కేంద్రం కత్తి పెడితే సీఎం రేవంత్ ఆ కత్తికి సాన పడుతున్నారని ఎద్దేవా చేశారు. సింగరేణికి ప్రమాదం వస్తే కాపాడేది బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. సింగరేణిని కార్పొరేట్ గద్దలకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ నిర్ణయాన్ని అడ్డుకుంటామన్నారు. వేలంలో పాల్గొనే వారు ఆలోచించాలని కోరారు. ఈ నిర్ణయాన్ని కేంద్రం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.
ఒరిస్సా, గుజరాత్‌లో ప్రభుత్వ సంస్థలకు ఇచ్చి ఇక్కడ సింగరేణికి బొగ్గు బ్లాక్స్ ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. సింగరేణి వేలంలో ఎందుకు పాల్గొనాలని నిలదీశారు. ఇక్కడ ఉన్న ఎంపీలు చేత కానివారా అని కేటీఆర్ మండిపడ్డారు. సింగరేణికి బొగ్గు గనులు కేటాయించకుండా ఉద్దేశపూర్వకంగా చేస్తున్న కుట్ర ఇది. రేవంత్ రెడ్డి వ్యతిరేకత ఎందుకు మాయమైంది. ముఖ్యమంత్రిగా వేలం పాటలో పాల్గొంటామని చెబుతున్నారు. ఇది దారుణం అని కేటీఆర్ మండిపడ్డారు. కేంద్రం మా మెడ మీద కత్తి పెట్టినా బొగ్గు గనులను వేలం వేయకుండా చూశాం. తొమ్మిదిన్నరేండ్లు సింగరేణిని కాపాడుకున్నాం. సింగరేణి లాభపడితే మన రాష్ట్రానికి లాభం జరుగుతుంది. కార్మికులు లాభపడుతారు. సింగరేణి కార్మికులు జంగ్ సైరన్ ఊదితే దక్షిణ భారతదేశం అంధకారంలోకి వెళ్తుందన్నారు.

# రివ్యూల్లో పవన్ కల్యాణ్ ప్రత్యేకతే వేరు

### తొలిరోజు పది గంటల పాటు సమీక్ష

డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తొలిరోజే విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో పవన్ తన శాఖలపై సుదీర్ఘంగా సమీక్షించిన విషయం తెలిసిందే. సుమారు 10 గంటలపాటు జరిగిన ఈ సమీక్షలో పవన్ తన శాఖల తీరు తెన్నుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీశాఖ అధికారులు, సిబ్బంది ఆయా శాఖల పనితీరు, రాష్ట్రంలోని పరిస్థితుల గురించి పవన్ కు వివరించారు.

### ప్రణాళికలతో రండి..

అనంతరం అధికారులతో పవన్ మాట్లాడుతూ "రెండు రాష్ట్రాల్లో గ్రామీణ ప్రాంతాలను సందర్శించిన నాకు వారి సమస్యలపై పూర్తి అవగాహన ఉంది. ఏజన్సీ ప్రాంతాల్లో కూడా బాగా పర్యటించా. వారి సమస్యలపై మరింత అవగాహన తెచ్చుకొని వారికి ఉపయోగపడేలా ప్రణాళికలు రూపొందించేందుకు ప్రయత్నిస్తా. అరకు లాంటి గిరిజన ప్రాంతాల్లో మహిళలు తాగునీటి కోసం ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో స్వయంగా చూశా. పథకాల అమల్లో రాజకీయం జోక్యానికి అవకాశం ఇవ్వను. జల్‌జీవన్ మిషన్ ద్వారా 2028 లోపు ప్రతి ఇంటికీ కొళాయి నీరు ఇచ్చే విధంగా లక్ష్యాలు నిర్దేశించుకోవాలి. గిరిజన ప్రాంతాల్లో తాగునీటిని అందించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలి. అన్ని పంచాయతీలకు రోడ్డు కనెక్టివిటీ ఉండేలా ప్రణాళికలతో ముందుకు రండి" అని అధికారులకు సూచించారు.

### సొంతవాళ్లయినా ఉపేక్షించను

తన మార్కు రాజకీయంతో ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించేందుకు ముందుకు కదిలిన జనసేనాని అవకతవకలు జరిగితే అధికారులనే కాదు సొంత పార్టీ వాళ్లనైనా ఉపేక్షించేది లేదని తొలి సమీక్షలోనే స్పష్టం చేశారు. ఉపాధి హామీ కూలీల వేతనాల చెల్లింపుల్లో ఆలస్యానికి కారణం ఎవరు? పంచాయతీలకు సమాంతరంగా సచివాలయాలను ఎందుకు ఏర్పాటు చేయాల్సి వచ్చింది? స్థానిక సర్పంచ్‌లకు వాటిపై నియంత్రణ లేకపోతే ఎలా? ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయతీలకు ఎందుకు ఇవ్వట్లేదు? అని సమీక్షలో పవన్ అధికారులను ప్రశ్నించారు. పవన్ ప్రశ్నల వర్షానికి అధికారులు నీళ్లు నమిలినట్లు తెలుస్తోంది. అనంతరం ఆయన సచివాలయంలో సీఎస్ నీరభ్ కుమార్ ప్రసాద్ ని కలిసి పలు అంశాలపై చర్చించారు.

### రెండోట రోజూ అదేతీరు

ఇక, వరుసగా రెండో రోజూ పవన్ సమీక్షలకే పూర్తి సమయం కేటాయించనున్నారు. తన శాఖలకు సంబంధించిన సోషల్ ఆడిట్, ఇంజినీరింగ్, గ్రామీణ నీటి సరఫరా విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం పవన్ ఉపాధి హామీ పథకాన్ని ఉద్యానవన సంబంధిత పనులకు అనుసంధానించి నిధులు మంజూరు చేస్తూ తయారు చేసిన ఫైల్ పై తొలి సంతకం, గిరిజన గ్రామాల్లో పంచాయతీ భవనాల నిర్మాణానికి సంబంధించిన ఫైల్ పై రెండో సంతకం చేసిన విషయం తెలిసందే.

# సింగరేణిని కాపాడుకోవడానికి అవసరమైతే మోదీని కలుస్తాం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రాంతానికే తలమానికమైన సింగరేణిని కాపాడుకోవడానికి అవసరమైతే ప్రధాని నరేంద్రమోదీని కలుస్తామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. సింగరేణి బంద్ అయితే వేలాది మంది తమ ఉద్యోగాలు పోగొట్టుకుని రోడ్డున పడతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. శ్రావణపల్లి బొగ్గు గనులను కేంద్రం వేలం వేస్తోందని ఈ విషయం గురించి కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని కలుస్తామని తెలిపారు. ఖమ్మంలో గురువారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సింగరేణి, బొగ్గు గనులపై బీఆర్ఎస్ నేతల తీరు దొంగే దొంగ అన్నట్లు ఉందన్నారు. గనుల వేలం సమయంలో బీఆర్ఎస్, బీజేపీ నేతల వ్యాఖ్యలు రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తున్నాయంటూ మండిపడ్డారు.

### అన్ని పార్టీలను కలుపుకుపోతాం

సింగరేణి సంస్థలో 42 వేల మంది రెగ్యూలర్, 26 వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారని భట్టి పేర్కొన్నారు. ప్రస్తుతం సంస్థ ద్వారా 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతోందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సింగరేణి తన ప్రాభవాన్ని కోల్పోయిందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీని కలిసి తెలంగాణ ఆస్తులను కాపాడాలని విజ్ఞప్తి చేస్తామని మంత్రి అన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీల వారిని కలుపుకుని ప్రధాని మోదీని కలుస్తామన్నారు. కొన్ని రోజులుగా రాష్ట్రంలో ఉన్న బొగ్గు గనులను కేంద్ర ప్రభుత్వం వేలం వేసే ప్రక్రియ మొదలు పెడుతుందని చెప్పారు. రేపు హైదరాబాద్ లో ఆక్షన్ జరగబోతుందన్నారు.

### బీఆర్ఎస్ మొసలి కన్నీరు

ఏనాడు సింగరేణి ఉద్యోగులను పట్టించుకోని బీఆర్ఎస్ ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తుందంటూ ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీ నేతల మాటలు రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తున్నాయన్నారు. 40 బొగ్గు గనుల్లో ప్రస్తుతం బొగ్గు ఉత్పత్తి జరుగుతుంది. ఇప్పుడు ఉత్పత్తి అవుతున్న 70 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి 2026కి పూర్తిగా పడిపోతుంది. 2031-32 వరకు బొగ్గు ఉత్పత్తి సామర్థ్యాన్ని సింగరేణి నిలబెట్టుకోవాలన్నా.. ఉద్యోగుల మనుగడ కొనసాగాలన్నా కేంద్రం నిర్వహించే గనుల ఆక్షన్ లో సింగరేణి యాజమాన్యం తప్పనిసరిగా కొత్త బొగ్గు గనులను సొంతం చేసుకోవాల్సిందేనన్నారు. లేని పక్షంలో సింగరేణి సంస్థ చరిత్రలో కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న కోల్ బ్లాక్స్ అన్నింటిని కూడా ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి ఇస్తే బాగుండేదన్నారు మంత్రి భట్టి విక్రమార్క.

### ఆ బిల్లుకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు

2015లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మైన్స్ అండ్ మినరల్స్ డెవెలప్‌మెండ్ రెగ్యూలేషన్ యాక్ట్-1957 యాక్ట్‌లో సవరణ తీసుకొచ్చింది. దీని ద్వారా దేశంలో ఉన్న బొగ్గు గనులను ప్రభుత్వ రంగ సంస్థకు నేరుగా ఇవ్వకుండా వేలం ద్వారా ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టేందుకు కుట్ర చేసిందని మంత్రి ఆరోపించారు. మైన్స్ అండ్ మినరల్స్ డెవెలప్‌మెండ్ రెగ్యూలేషన్ యాక్ట్-1957 యాక్ట్‌లో సవరణ బిల్లుకు పార్లమెంటులో ఆనాడు బీఆర్ఎస్ కూడా మద్దతు ఇచ్చిందంటూ గుర్తు చేశారు. కేంద్రం పెట్టిన బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇచ్చిన బీఆర్ఎస్ పదేళ్లు సింగరేణిని కాపాడమంటు న్నారు. తెలంగాణ మీద ప్రేమ ఉన్నట్లు బీజేపీ మంత్రులు మాట్లాడుతున్నారు. సింగరేణి సంస్థను కాపాడుకునేందుకు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని కలుస్తామన్నారు.

# న్యాయంగా, ధర్మంగా చూస్తే మనం ఓడిపోలేదు

కుటుంబాలను పరామర్శిస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది డిసెంబర్ నుంచి లేదా వచ్చే ఏడాది జనవరి నుంచి ఆయన ఓదార్పు యాత్ర చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

### మళ్లీ అధికారంలోకి వస్తాం

రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి, ప్రతి గడపకూ మనం చేసిన మంచిని ప్రజలు మరిచిపోరని వైఎస్ జగన్ పార్టీ నేతలతో అన్నారు. 'ఇదే ప్రజలు 2029 నాటికి చంద్రబాబు మోసాలు, ప్రలోభాలు గుర్తించి రెట్టించిన ఉత్సాహంతో వైసీపీని అధికారంలోకి తెచ్చుకుంటారు. ఈసారి ఎన్నికల్లో 40 శాతం ఓట్లు షేర్ అంటే 2019తో పోలిస్తే కేవలం 10 శాతం ఓట్లు తగ్గాయి. ఈ 10 శాతం ప్రజలు కూడా చంద్రబాబు మోసాలు, ప్రలోభాలను గుర్తిస్తారు. ప్రతీ కుటుంబానికి మనం చేసిన మంచి ఏంటో ప్రజలకు తెలుసు. విశ్వసనీయతకు మనం చిరునామా. మనం చేసిన మంచే మనకు శ్రీరామరక్ష. ఈ రోజుకీ జగన్ అబద్దాలు చెప్పడు. మోసాలు చేయడు అని ప్రజలకు తెలుసు. ప్రజలతో కలిసి చేసే పోరాటాల్లో వైసీపీకి, జగన్‌కు ఎవ్వరూ సాటిరారు. ప్రజలకు మరింత దగ్గరయ్యే కార్యక్రమాలు, ప్రజల తరఫున పోరాటాలు చేస్తాం. ఏకంగా స్పీకర్ పదవి తీసుకోబోయే వ్యక్తి మాట్లాడుతున్న మాటలు మనం సోషల్ మీడియాలో చూస్తున్నాం. ఇలాంటి కౌరవులు ఉండే సభకు మనం వెళ్లాల్సి ఉంటుంది.' అని జగన్ పేర్కొన్నారు.

### కార్యకర్తలకు భరోసా ఇవ్వాలి

ఎన్నికల్లో ఓడిపోయామన్న భావనను మనసులోంచి తీసేయాలని పార్టీ నేతలకు వైఎస్ జగన్ దిశానిర్దేశం చేశారు. 'న్యాయంగా, ధర్మంగా మనం ఓడిపోలేదు. ప్రతీ ఇంట్లోనూ మనం చేసిన మంచి ఉంది. మళ్లీ రికార్డు మెజార్టీతో గెలుస్తాం. మన కార్యకర్తలకు మనం తోడుగా ఉండాలి. ఎప్పుడూ చూడని విధంగా మన కార్యకర్తలపై, పార్టీ సానుభూతిపరులపై దాడులు చేస్తున్నారు. కొన్నిచోట్ల అవమానాలు, ఆస్తుల నష్టం కలిగిస్తున్నారు. వీళ్లందరికీ భరోసా ఇవ్వాలి. రాబోయే రోజుల్లో నేను కార్యకర్తలను కలుసుకుంటాను. పార్టీ జెండాలు మోసి కష్టాలు పడ్డ వారికి తోడుగా ఉంటాను. ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, పార్టీ స్థానిక నేతలు అంతా అందరికీ భరోసా ఇవ్వాలి. మనలో నిరాశకు ఎట్టి పరిస్థితుల్లోనూ చోటివ్వకూడదు. ప్రతి అభిమాని, కార్యకర్తకు భరోసా ఇవ్వాల్సిన బాధ్యత మనది.' అని జగన్ పిలుపునిచ్చారు.

### శకుని పాచికలా మాదిరిగా

'మేనిఫెస్టోలో 99 శాతం హామీలను అమలు చేసినా ఎన్నికల ఫలితాలు ఇలా రావడం ఆశ్చర్యం కలిగించింది. ఫలితాలు చూసిన తర్వాత శకుని పాచికల కథ గుర్తుకువచ్చింది. శకుని పాచికల మాదిరిగా ఎన్నికల ఫలితాలు వచ్చాయి. కానీ ఆధారాలు లేకుండా ఏమీ మాట్లాడలేం. ఇప్పుడు కేవలం ఇంటర్వెల్ మాత్రమే. శ్రీకృష్ణుడు తోడుగా ఉన్నా పాండవులు ఓడిపోతారు. ధర్మం, విశ్వసనీయత, నిజాయతీ తప్పకుండా గెలుస్తాయి.

# రష్యా ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపిన మోదీ పేపర్ లీకేజీని ఆపలేకపోతున్నారు

అన్నిచోట్లా ఆ సంస్థకు చెందిన వ్యక్తుల్నే వైస్ ఛాన్సలర్‌లుగా నియమిస్తున్నారని రాహుల్ గాంధీ అన్నారు. ఈ వివాదంపై పార్లమెంట్‌లో కచ్చితంగా చర్చిస్తామని స్పష్టం చేశారు రాహుల్ గాంధీ. ఈ విషయంలో క్లీన్ చిట్ వచ్చిందంటే మోదీ ప్రభుత్వాన్ని క్రెడిబిలిటీ లేనట్టే అని తేల్చి చెప్పారు. మధ్యప్రదేశ్, గుజరాత్, యూపీ కేంద్రాలుగా ఈ అవకతవకలు జరిగాయన్న విషయం అందరికీ తెలుసని అన్నారు. ఇదో కుంటి ప్రభుత్వం అని విమర్శించిన రాహుల్ గాంధీ..ఈ వివాదంపై స్పందించేందుకు కూడా వాళ్లకు మనసొప్పడం లేదని మండి పడ్డారు.

# లిక్కర్ లిక్కర్ కేసులో కేజ్రీవాల్‌కు బెయిల్

లోక్‌సభ ఎన్నికల సందర్భంగా 15 రోజుల మధ్యంతర బెయిల్‌ను సుప్రీంకోర్టు మంజూరు చేసింది. అయితే రెగ్యులర్ బెయిల్ కోసం కింది కోర్టుకు వెళ్లాలని సూచించింది. ఈ క్రమంలోనే ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో గతంలోనే రెగ్యులర్ బెయిల్ కోసం అరవింద్ కేజ్రీవాల్ పిటిషన్ దాఖలు చేశారు. కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో బుధవారం, గురువారం సుదీర్ఘ వాదనలు జరగ్గా వాటన్నింటినీ పరిశీలించిన కోర్టు తీర్పును రిజర్వ్ చేసి తాజాగా బెయిల్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇక కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌పై వాదనల సందర్భంగా ఈడీ అధికారులు ఆయనపై సంచలన ఆరోపణలు చేశారు. ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో అరవింద్ కేజ్రీవాల్ లంచంగా రూ.100 కోట్లను డిమాండ్ చేశారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఈ కేసులో ఆప్‌ను నిందితుల జాబితాలో చేర్చడాన్ని ఈడీ సమర్థించుకుంది. కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీ గడువు ముగియడంతో బుధవారం ఆయనను ఈడీ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచారు. ఈ నేపథ్యంలోనే బెయిల్ పిటిషన్‌పై ఈడీ, కేజ్రీవాల్ తరఫు లాయర్లు వాదనలు వినిపించారు. ఆప్‌కు నిధుల కోసం రూ.100 కోట్లు ఇవ్వాలని.. అరవింద్ కేజ్రీవాల్ లంచం కింద సౌత్‌గ్రూప్‌ను డిమాండ్ చేశారని ఈడీ ఆరోపించింది. హవాలా రూపంలో రూ.100 కోట్లు గోవాకు చేరినట్లు తెలిపారు. అయితే ఈ ఆరోపణలను కేజ్రీవాల్ తరఫు న్యాయవాదులు ఖండించారు.

# ఆ ఇద్దరేనా...

## - రాధా, వర్మలను ఊరిస్తున్న ఎమ్మెల్సీలు

**విజయవాడ :** ఏపీలో రెండు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అయ్యాయి. వాటికి సంబంధించి ఎన్నిక జరగనుంది. ఈనెల 25న ఎలక్షన్ కమిషన్ షెడ్యూల్ ప్రకటించనుంది. వైసీపీ నుంచి టీడీపీలోకి ఫిరాయించిన ఎమ్మెల్సీలు రామచంద్రయ్య, ఇక్బాల్ పై అనర్హత వేటుపడడంతో.. ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నిక అనివార్యంగా మారింది. ఆ ఇద్దరూ ఎమ్మెల్యేలు ఎన్నుకున్నవారే. ఎవరైనా ఎమ్మెల్సీలు రాజీనామా చేసినా, అనర్హత వేటుపడినా మూడు నెలల వ్యవధిలో ఎన్నికలు నిర్వహించాలి. ఆ ఇద్దరు ఎమ్మెల్సీలపై వేటుపడి రెండు నెలలు దాటుతోంది. అందుకే ఎన్నికల కమిషన్ షెడ్యూల్ వెల్లడించింది. అయితే ఆ రెండు ఎమ్మెల్సీల ఎన్నిక లాంఛనమే. కనీసం పోటీ పెట్టే పరిస్థితిలో వైసీపీ లేదు. టిడిపి కూటమి అంతులేని మెజారిటీని కైవసం చేసుకుంది. 166 స్థానాలతో పటిష్టమైన స్థితిలో ఉంది. టిడిపి ఒక్కటే ఒంటరిగా 135 సీట్లలో గెలుపొందింది.

ఈ ఐదేళ్లలో ఎమ్మెల్యేల ద్వారా ఎన్నికయ్యారు ఎమ్మెల్సీలను ఏకపక్షంగా కూటమి గెలుచుకోనుంది. అయితే ఎమ్మెల్సీలుగా ఎవరికి ఛాన్స్ ఇస్తారన్న చర్చ బలంగా నడుస్తోంది. పొత్తులో భాగంగా చాలామంది టిక్కెట్లు వదులుకున్నారు. త్యాగం చేశారు. అటువంటి వారికి ప్రత్యామ్నాయ రూపంలో అవకాశం కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ ఆశావహులంతా పావులు కదుపుతున్నారు. శాసనమండలి నుంచి ఒకరిని తీసుకుని మంత్రి పదవి కేటాయిస్తారని.. అందుకే క్యాబినెట్లో కేవలం 24 మందిని మాత్రమే భర్తీ చేశారని ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్సీగా వంగవీటి రాధాకృష్ణకు ఛాన్స్ ఇస్తారని ప్రధానంగా చర్చ నడుస్తోంది. ఎమ్మెల్సీగా ఎంపిక చేసి మంత్రివర్గంలోకి తీసుకుంటారని కూడా టాక్ నడుస్తోంది. 2019 ఎన్నికలకు ముందు టిడిపిలో చేరారు రాధ. కానీ పోటీ చేసేందుకు ఛాన్స్ దక్కలేదు. కేవలం అప్పట్లో ప్రచారానికి పరిమితమయ్యారు. పార్టీ అధికారంలోకి రాకపోవడంతో నిరాశకు గురయ్యారు.

కానీ గత ఐదేళ్లుగా వేరే పార్టీలో చేరలేదు. ఈ ఎన్నికల్లో సైతం టికెట్ ఆశించారు. కానీ దక్కలేదు. ఈసారి కూడా అంకితభావంతో ప్రచారం చేశారు. పార్టీ అధికారంలోకి వచ్చింది. 2009 తర్వాత రాధ పొలిటికల్ కెరీర్ ఆశించిన స్థాయిలో లేదు. అందుకే ఇప్పుడు చంద్రబాబు రాధా కెరీర్ గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తారని తెలుస్తోంది. మరోవైపు పవన్ కోసం సీటు త్యాగం చేసిన వర్మకు ఎమ్మెల్సీ పదవి ఇస్తారని తెలుస్తోంది. పిఠాపురం నియోజకవర్గంలో వర్మకు తిరుగులేదు. అది టిడిపి గెలిచే సీటు కూడా. అటువంటి సీటును పవన్ కోసం త్యాగం చేశారు వర్మ. పవన్ విజయానికి కృషి చేశారు. పవన్ ను అత్యధిక మెజారిటీతో గెలిపించి తీసుకొస్తానని చంద్రబాబుకు మాట ఇచ్చారు వర్మ. అటు పవన్ సైతం వర్మ విషయంలో సానుకూలంగా ఉన్నారు. తన కోసం సీటు త్యాగం చేసిన వర్మకు న్యాయం చేయాలని కూడా చంద్రబాబుకు పవన్ కోరినట్లు తెలుస్తోంది. అందుకే ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టి మంత్రివర్గంలోకి తీసుకుంటారని ప్రచారం జరుగుతోంది. మరోవైపు పొత్తుల్లో భాగంగా మైలవరం సీటు వదులుకున్నారు మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు. అటు తెనాలి టికెట్ను నాదెండ్ల మనోహర్ కు ఇచ్చేందుకు సమ్మతించారు మాజీ మంత్రి ఆలపాటి రాజా. వారు కూడా ఎమ్మెల్సీ రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. మరి చంద్రబాబు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి

# ఆరో పెద్ద పార్టీగా టీడీపీ

**గుంటూరు :** తెలుగుదేశం పార్టీ జాతీయస్థాయిలో మరోసారి గుర్తింపు సాధించింది. 18వ లోక్ సభలో ఆరు పెద్ద పార్టీగా అవతరించింది. 41 పార్టీల సభ్యులతో కొత్తగా ఏర్పడనున్న లోక్ సభలో.. 16 మంది సభ్యులతో ఈ ఘనత సాధించింది. జాతీయస్థాయిలో టిడిపి గుర్తింపు సాధించడం ఇది మొదటిసారి కాదు.

గతంలో లోక్ సభలో ప్రధాన ప్రతిపక్ష హోదా టిడిపికి దక్కింది. జాతీయస్థాయిలో ప్రధాన ప్రతిపక్ష హోదాతో సముచిత స్థానం దక్కించుకుంది ఆ పార్టీ. మళ్లీ ఇన్నాళ్లకు ఈ చాన్స్ వచ్చింది. ఇటీవల దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ముచ్చటగా ఎన్డీఏ మూడోసారి అధికారాన్ని సొంతం చేసుకుంది. గత రెండు ఎన్నికల్లో బిజెపి సొంతంగా అధికారంలోకి రాగా.. ఇప్పుడు ఎన్ డి ఏ మిత్రపక్షాల సాయంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. ముఖ్యంగా ఎన్డీఏ లో రెండో అతిపెద్ద పార్టీగా తెలుగుదేశం నిలిచింది. జెడియు మరో భాగస్వామ్యపక్షంగా నిలబడింది. అందుకే చంద్రబాబుతో పాటు నితీష్ కుమార్ కు ప్రాధాన్యత దక్కింది.

తాజాగా లోక్సభలో సంఖ్యాపరంగా తెలుగుదేశం పార్టీ ఆరో స్థానంలో నిలిచింది. ఆ పార్టీకి ప్రత్యర్థిగా ఉన్న వైసిపి 15వ స్థానానికి పరిమితం అయ్యింది. 41 పార్టీల సభ్యులతో లోక్సభ కొలువుదీరింది. బిజెపి నుంచి 240 మంది సభ్యులు, కాంగ్రెస్ 99, సమాజ్ వాది 37, తృణమూల్ కాంగ్రెస్ 29, డీఎంకే 22 స్థానాలు సాధించాయి. టాప్ 5 లో నిలిచాయి. 16 మంది సభ్యులతో తెలుగుదేశం పార్టీ ఆరో పెద్ద పార్టీగా అవతరించింది. ఈ ఎన్నికల్లో బిజెపికి మాత్రమే మూడంకెల స్థానాలు దక్కాయి. 34 పార్టీలకు ఏక అంకె సీట్లు వచ్చాయి. 16 పార్టీలకు కేవలం ఒక్కో సీటు మాత్రమే వచ్చింది. వైసీపీకి నాలుగు స్థానాలు వచ్చాయి. జనసేనకు రెండు సీట్లు దక్కాయి. అయితే ఏపీ నుంచి తెలుగుదేశం పార్టీకి 16 సీట్లు దక్కడం విశేషం. ఎన్డీఏలో రెండో పెద్ద పార్టీగా, జాతీయస్థాయిలో ఆరో పెద్ద పార్టీగా నిలవడం విశేషం. జాతీయస్థాయిలో తెలుగుదేశం పార్టీ చక్రం తిప్పిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఎన్టీఆర్ తోపాటు చంద్రబాబు సైతం సంకీర్ణ ప్రభుత్వాల ఏర్పాట్లు క్రియాశీలక పాత్ర పోషించారు. ఇందిరా గాంధీ హత్య సమయంలో దేశవ్యాప్తంగా కాంగ్రెస్కు సానుకూల పవనాలు వీచాయి. కానీ ఏపీలో మాత్రం తెలుగుదేశం పార్టీ హవా నడిచింది. ఆ పార్టీ మెరుగైన సీట్లను దక్కించుకుంది.

దేశవ్యాప్తంగా విపక్షాలు తుడుచుపెట్టుకుపోయాయి. ఆ సమయంలో లోక్సభలో ప్రతిపక్ష పాత్ర పోషించింది టిడిపి. యునైటెడ్ ఫ్రంట్, నేషనల్ ఫ్రంట్ ఏర్పాటులో కూడా కీలకంగా మారింది. 1996లో వాజ్పేయి నేతృత్వంలోని ఎన్డీఏ సుస్థిరతకు కూడా టిడిపి ఒక కారణం. ఇప్పుడు ఈ ఎన్నికల్లో ఎన్డీఏ భాగస్వామ్య పక్షంగా టిడిపి పాత్ర కీలకం. ఆరో అతిపెద్ద పార్టీగా అవతరించి జాతీయ స్థాయిలో సైతం టిడిపి క్రియాశీలక పాత్ర పోషిస్తుండడం విశేషం.

# కల్కి ఓ అద్భుత సినిమా

## – ప్రీ రిలీజ్ వేడుకల్లో ప్రముఖుల ఆనందం






కథే కాదు... ఆ ప్రపంచానికి సంబంధించిన విజువల్స్ మొదలుకొని ప్రతి అంశాన్నీ ఊహించుకుని భవిష్యత్తుతో ముడిపడిన ఓ అద్భుతమైన సినిమాని తెరకెక్కించాడు నాగ్ అశ్విన్. ఇందులో నేనొక భాగం కావడం నాకెంతో గర్వకారణం అన్నారు ప్రముఖ నటుడు అమితాబ్ బచ్చన్. ఆయన ఓ కీలక పాత్రలో నటించిన చిత్రం 'కల్కి 2898 ఎ.డి'. ప్రభాస్ కథానాయకుడు. అమితాబ్ బచ్చన్ మాట్లాడుతూ 'ఈ సినిమా ఓ కొత్త ప్రపంచం. నాకు ఎప్పటికీ మరిచిపోలేని అనుభవాన్నిచ్చింది. నాగ్ అశ్విన్ ఈ కథ చెప్పినప్పుడు ఆశ్చర్యపోయాను. ఏం తాగితే ఇలాంటి ఆలోచనలు వస్తాయా అనిపించింది. నిర్మాత అశ్వనీదత్ లాంటి నిర్మాతని ఇదివరకు నేనెప్పుడూ కలవలేదు. ఆయన వ్యక్తిత్వం ఎంతో గొప్పది' అన్నారు. దీపికా పదుకొణె కథానాయిక. కమల్ హాసన్ ప్రతినాయకుడిగా నటించారు. వైజయంతీ మూవీస్ పతాకంపై సి.అశ్వనీదత్ నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా బుధవారం రాత్రి ముంబయిలో చిత్రబృందం విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహించింది. ఈ సందర్భంగా యువ కథానాయకుడు రానా దగ్గుబాటి అడిగిన పలు ప్రశ్నలకు చిత్రబృందం సమాధానమిచ్చింది. వేడుకలో తొలి టికెట్‌ని అమితాబ్ బచ్చన్ కొని కమల్‌హాసన్‌కి అందజేశారు. ఈ సందర్భంగా కమల్‌హాసన్ మాట్లాడుతూ 'ఇలా తొలి ఆట తొలి టికెట్‌ని పొందే అవకాశం 'షోలే' సినిమాకి దక్కుంటే బాగుండేది. కొన్ని వారాలపాటు ఆ సినిమా టికెట్ కోసం ఎదురు చూడాల్సి వచ్చింది. అప్పట్లో ఆ సినిమాని చూసిన అభిమానులకంటే ఎక్కువగా ఇప్పుడు 'కల్కి 2898 ఎ.డి'ని చూస్తారని ఆశిస్తున్నా. నా గురువు, మార్గదర్శి బాలచందర్‌లాగా అసాధారణమైన మనుషులు చాలా సాధారణంగా కనిపిస్తుంటారు. అందుకే అలాంటివాళ్లతో మాట్లాడేవరకూ వాళ్లపై ఓ అభిప్రాయానికి రాను. సాధారణమైన వ్యక్తిలాగే వచ్చిన నాగ్ అశ్విన్ కథ చెప్పడంలో నేర్పుని చూసి అద్భుతం అనిపించింది. సినిమానీ అంతే నేర్పుగా తెరపైకి తీసుకొచ్చాడు' అన్నారు. ప్రభాస్ మాట్లాడుతూ 'నేను కన్న కలల కంటే గొప్పది ఈ సినిమా. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణెలతో కలిసి నటించడం అద్భుతమైన అనుభవం' అన్నారు. దీపికా పదుకొణె మాట్లాడుతూ 'ఇందులో నేను తల్లి పాత్రలో కనిపిస్తా. నాగ్ అశ్విన్ కథ చెప్పినప్పుడు ఇదివరకెప్పుడూ లేని ఓ కొత్త అనుభవం కలిగింది' అన్నారు. ఈ కార్యక్రమంలో అశ్వనీ దత్, ప్రియాంక దత్, స్వప్న దత్ పాల్గొన్నారు.

## దీపికకు ప్రభాస్ చేయూత..

### – నైస్ అంటూ అమితాబ్ ప్రశంస

'భైరవ అంథమ్' ఇండియన్స్ బి÷-గగెస్ట్ సాంగ్ అఫ్ ది ఇయర్ గా టాప్ చార్ట్ లో వుంది. ఈ మల్టీలింగ్వెల్, మైథాలజీ -ఇన్స్ స్పైర్డ్ సైన్స్ ఫిక్షన్ విజువల్ వండర్ జూన్ 27న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ముంబై లో గ్రాండ్ గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్ లో కల్కి టీంతో హ్యాండ్సమ్ హంక్ రానా దగ్గుబాటి ఇంటరాక్షన్ స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలిచింది. కాగా కల్కిలో దీపిక గర్భవతిగా కనిపించింది. విశేషమేమిటంటే.. ఇప్పుడు నిజ జీవితంలోనూ దీపికా పదుకోణె గర్భంతో ఉంది. ముంబై'కల్కి 2898 ఏడీ' ప్రీ రిలీజ్ ఈవెంట్ దీపికా హాజరైంది.

అయితే నిండు గర్భంతో ఉన్న ఆమె స్టేజి మీద నుంచి కిందకు దిగుతున్న సమయంలో ప్రభాస్ చెయ్యి అందించి సహాయం చేశారు. అదే సమయంలో అక్కడ ఉన్న అమితాబ్ బచ్చన్ సరదాగా ప్రభాస్, దీపికను సరదాగ ఆట పట్టించారు. ప్రభాస్ భుజం తట్టి నైస్ అన్నట్టు ప్రోత్సహించారు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది. మహిళలను గౌరవించడం ప్రభాస్ తర్వాతే ఎవరైనా, పాన్ ఇండియా స్టార్ సింప్లిసిటీకి ఇది నిదర్శనమంటూ అభిమానులు, నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.



# లక్కీ భాస్కర్‌తో వస్తున్న దుల్కర్

విభిన్న భాషల్లో సినిమాలు చేస్తూ నటుడిగా జాతీయ స్థాయిలో చక్కని గుర్తింపు సొంతం చేసుకున్నారు దుల్కర్ సల్మాన్. తెలుగులోనూ 'మహానటి', 'సీతారామం' లాంటి చిత్రాలతో విజయాలను అందుకున్నారు. ఆయన తాజాగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్టైన్మెంట్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. 'లక్కీ భాస్కర్' చిత్రంలో బ్యాంక్ క్యాషియర్‌గా మునుపెన్నడూ చూడని కొత్త లుక్‌లో దుల్కర్ సల్మాన్ కనిపించ నున్నారు. ఈ చిత్రం నుంచి 'కోపాలు చాలండి శ్రీమతి గారు...కొంచెం కూల్ అవ్వండి మేడం గారు' అంటూ సాగే గీతాన్ని యూనిట్ బుధవారం విడుదల చేసింది. జీవీ ప్రకాశ్ కుమార్ ప్రత్యేక శైలిలో స్వరపరిచిన ఈ గీతాన్ని విశాల్ మిశ్రా, శ్వేతా మోహన్‌లు ఆలపించారు. శ్రీమణి సాహిత్యం ఈ గీతానికి ప్రత్యేకాకర్షణగా నిలిచింది. దుల్కర్ సరసన మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: నిమిష్ రవి, ఎడిటర్:నవీన్ నూలి

# పుష్ప రిలీజ్ రోజే ఛావా విడుదల

## – రెంటిలోనూ రష్మికే హీరోయిన్



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, నేషనల్ క్రష్ రష్మిక మందన్న కలిసి నటిస్తున్న సినిమా 'పుష్ప – 2 ది రూల్'. సుకుమార్ ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా ఆగస్టు 15న రిలీజ్ కావాల్సి ఉండగా, షూటింగ్ ఆలస్యంతో డిసెంబర్ 6కు మార్చారు. అయితే, రష్మిక మాత్రం ఈ విషయంలో అసంతృప్తిగా ఉన్నారట. ఎందుకు అంటే.'ఛావా' కూడా అదేరోజు.. రిలీజ్ కాబోతోంది. పుష్ప' సినిమాతో పాన్ ఇండియా స్టార్ అయిపోయింది రష్మిక. దీంతో ఆమె ఫాలోయింగ్ పెరిగిపోయింది. ఆ సినిమా తర్వాత వరుస అవాకాశాలతో దూసుకుపోతోంది. పుష్ప తర్వాత మరో భారీ హిట్ సినిమా 'యానిమల్'. దీంతో రష్మికకు బాలీవుడ్ లో కూడా విపరీతమైన ఫాలోయింగ్ పెరిగిపోయింది. వరుస ప్రాజెక్ట్ లతో బిజీ బిజీగా ఉంది. విక్కీ కౌశల్ తో ఆమె నటించిన సినిమా 'ఛావా'. ఛత్రపతి శివాజి జీవిత కథ ఆధారంగా ఈసినిమా తెరకెక్కుతోంది. అయితే, ఆ సినిమా కూడా డిసెంబర్ 6నే రిలీజ్ అవుతుందట. దీంతో రెండు సినిమాల మధ్య పోటీ ఉంటుందని, ఏదో ఒక సినిమాపై ఎఫెక్ట్ పడే అవకాశం ఉందని భావిస్తున్నారట రష్మిక. రెండు సినిమాలపై భారీ అంచనాలు ఉన్నాయి. 'పుష్ప' ఇప్పటికే బాలీవుడ్ ని షేక్ చేయడం, ఛత్రపతి శివాజీ లాంటి పవర్ ఫుల్ కథ కావడంతో రెండు సినిమాలపై భారీ అంచనాలు ఉన్నాయి ప్రేక్షకుల్లో. రెండు సినిమాల మధ్య పోటీ ఉంటుందని అనుకుంటున్నారట. అయితే బీ టౌన్ లో వినిపిస్తున్న మరో వార్త ఏంటంటే? 'ఛావా' సినిమాని పోస్ట్ పోన్ చేసే యోచనలో ఉన్నారట మేకర్స్. పుష్ప – 2' సినిమా నుంచి రిలీజైన రెండు పాటలు, అల్లు అర్జున్ లుక్ అన్నీ ప్రేక్షకులను తెగ ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా బన్నీ ఫ్యాన్స్ అయితే ఫిదా అయిపోయారు. దీంతో ఎప్పుడెప్పుడు సినిమా రిలీజ్ అవుతుందా అని వెయిట్ చేశారు చాలామంది. అయితే, ఇప్పుడు దాన్ని పోస్ట్ పోన్ చేస్తూ ప్రకటించారు. దానికి కారణం కూడా చెప్పింది మైత్రీ మూవీ మేకర్స్. సినిమా షూటింగ్ ఇంకా పెండింగ్ ఉందని, పోస్ట్ ప్రొడక్షన్ కి కూడా టైం పడుతుందని, క్వాలిటీ సినిమాని ప్రేక్షకులకు అందించాలనే ఉద్దేశంతోనే సినిమా పోస్ట్ పోన్ చేసినట్లు చెప్పింది. సుకుమార్ దర్శకత్వం వహించిన 'పుష్ప' బాక్సాఆఫీస్ రికార్డులను బద్దలు కొట్టింది. అటు నార్త్ లో కూడా ఈసినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇక ఈ సినిమాలో అల్లు అర్జున్, రష్మిక మందన్న జంటగా నటించారు. 'పుష్ప 2'లో మలయాళ స్టార్ హీరో ఫహాద్ ఫాజిల్, కన్నడ హీరో ధనుంజయ్, సునీల్, అనసూయ భరద్వాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. దేవి శ్రీప్రసాద్ సంగీతాన్ని అందించారు. ఇప్పటికే రిలీజైన రెండు పాటలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి.

# క్లీంకార రాకతో జీవితాలు పరిపూర్ణం

## ఉపాసన ఎమోషన్ వీడియో



రామ్ చరణ్, ఉపాసనల గారాలపట్టి క్లీంకార మొదటి పుట్టినరోజు ఈరోజు సందర్భంగా దంపతులకు శుభాకాంక్షలు వెల్లువెతుతున్నాయి. ఉపాసన ప్రసవించి ఏడాది అయింది. ఈ విషయాన్ని చెబుతూ తన కుమార్తెకు విషెస్ చెబుతూ ఉపాసన ఓ ఎమోషనల్ వీడియో షేర్ చేశారు. 'నా ప్రియమైన క్లీంకారకు పుట్టినరోజు శుభాకాంక్షలు. నీ రాకతో మా జీవితాలు పరిపూర్ణమయ్యాయి. మా జీవితాల్లో ఆనందం నింపినందుకు ధన్యవాదాలు' అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో షేర్ చేశారు. ఈ వీడియోను ఇప్పటికీ లెక్కలేనన్నిసార్లు చూసినట్లు ఉపాసన ఆ వీడియోలో చరణ్, ఉపాసనతోపాటు ఇరు కుటుంబాల వారు క్లీంకార పుట్టినప్పటి రోజులను గుర్తుచేసుకున్నారు. గతేడాది ఉపాసన పుట్టినరోజు నాడు చరణ్ ఈ వీడియోను షేర్ చేశారు. ఇప్పుడు దాన్నే మరోసారి ఆమె అభిమానులతో పంచుకున్నారు. క్లీంకార డెలివరీ టైమ్ నుంచి తమ కుటుంబంలో ఎలాంటి సందడి వాతావరణం నెలకొందో అన్న విషయాలను ఈ వీడియోలో చూపించారు.

ఇక క్లీంకారకు మెగా అభిమానులతోపాటు సినీ సెలబ్రిటీలు శుభాకాంక్షలు చెబుతున్నారు. 'లిటిల్ వండర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు' అని కాజల్ కామెంట్ పెట్టగా.. 'హ్యాపీ బర్త్‌డే లిటిల్ స్టార్' అని కియారా అద్వాణీ, రకుల్ ప్రీత్ సింగ్ రిప్లై పెట్టారు. ప్రస్తుతం ఈ వీడియో నెటళ్టింట వైరల్ అవుతోంది.

# పాడైపోయిన మటన్‌తో బిర్యానీ

## - ఆల్ఫా హెూటల్‌లో తనిఖీలు, జరిమానా




**- సికింద్రాబాద్ ఆల్ఫా హెూటల్‌పై అధికారుల దాడులు**

**- పాడైపోయిన మటన్, చికెన్‌తో బిర్యానీ**

**- కిచెన్‌లో దారుణ పరిస్థితులు**

**సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్)** చిప్స్ ప్యాకెట్‌లో చచ్చిన కప్ప, ఐస్ క్రీంలో మనిషి వేలు, చాక్లెట్ సిరప్‌లో ఎండిపోయిన ఎలుక కళేబరం. ఇటీవల కాలంలో వెలుగు చూసిన దారుణాలు ఇవి. ఈ వార్తలు వింటే చాలు బయట ఏదైనా తినాలంటే వణుకు పుడుతోంది. చిన్నా చితకా హెూటళ్లు, రెస్టారెంట్లలోనే కాదు పేరు మోసిన బడా హెూటళ్లలోనూ ఇదే యవ్వారం నడుస్తోంది. ఏ మాత్రం శుభ్రత లేకుండా ప్రజల ఆరోగ్యం గురించి పట్టింపు లేకుండా పాడైపోయిన వస్తువులతో ఆహారపదార్థాలు తయారు చేసి విక్రయిస్తున్నారు. డేట్ అయిపోయిన వస్తువులతో వండి వడ్డిస్తున్నారు. కాసుల కోసం కక్కుర్తిపడి ప్రజల ఆరోగ్యాలు దెబ్బతీస్తున్నారు. ఇటీవల కాలంలో హైదరాబాద్ నగరంలోని పలు రెస్టారెంట్లు, హెూటళ్లు, ప్రైవేటు హాస్టళ్లపై వరుసగా దాడులు చేసిన ఫుడ్ సెఫ్టీ, టాస్క్‌ఫోర్స్ అధికారుల అక్కడి పరిస్థితులు చూసి షాక్‌కు గురయ్యారు. తాజాగా జంట నగరాల్లో



ఫేమస్ అయిన సికింద్రాబాద్ ఆల్ఫా హెూటల్‌లో ఫుడ్ సెఫ్టీ, టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో



విస్తుపోయే అంశాలు వెలుగు చూశాయి. నాసిరకం వస్తువులతో పాటు కిచెన్‌లో అద్వాన పరిస్థితులను అధికారులు గుర్తించారు. పాడైపోయిన మటన్‌తో బిర్యాని తయారుచేసి వండిపెడుతున్నట్లు తనిఖీల్లో బయటపడింది. ఫుడ్ తయారుచేసి ఫ్రిజ్‌లో నిల్వ ఉంచుతూ ఆర్డర్ల మేరకు అప్పటికప్పుడు వేడి చేసి కస్టమర్లకు అందిస్తున్నట్లు తేలింది. ఆల్ఫా హెూటల్ నిర్వహకులు స్వయంగా తయారు చేసే బ్రెడ్‌తో పాటు ఐస్‌క్రీమ్, టీ పొడి కూడా నాసిరకంగా ఉన్నట్లు గుర్తించారు. బ్రెడ్, ఐస్‌క్రీమ్, టీ పొడి డేటు, బ్యాచ్ లేకుండా తయారు చేసి విక్రయాలు చేస్తున్నారు. కిచెన్ మొత్తంలో అపరిశుభ్రంగా ఉన్నట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులు వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఆల్ఫా హెూటల్‌పై కేసు నమోదు చేయటంతో పాటు రూ. 1 లక్ష ఫైన్ విధించినట్లు టాస్క్ ఫోర్స్ అధికారులు వెల్లడించారు. కాగా, గతంలోనూ ఆల్ఫా హెూటల్‌పై అధికారులు దాడులు నిర్వహించారు. అక్కడి దారుణ పరిస్థితులు చూసి హెూటల్‌ను సీజ్ కూడా చేశారు. ఇటీవల తిరిగి ఓపెన్ కాగా మరోసారి



హెూటల్ నిర్వాహకుల దారుణాలు వెలుగులోకి వచ్చాయి.

**- మరో హెూటల్‌లోనూ**



అలాగే, సికింద్రాబాద్‌లోని సందర్శిని హెూటల్‌లో కూడా అధికారులు తనిఖీలు చేపట్టారు. ఎక్స్‌పైరీ అయిన నూడుల్స్ ప్యాకెట్, అపరిశుభ్రంగా ఉన్న పదార్థాలు గుర్తించారు. అటు, రాజ్ బార్ అండ్ రెస్టారెంట్‌లోనూ సోదాలు చేశారు. కిచెన్‌లో ఎలుకలు తిరుగుతున్న దృశ్యాలను చూసి అధికారులు షాకయ్యారు. కిచెన్‌లో దారుణ పరిస్థితులను చూసి బార్ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అటు, మాదాపూర్, అమీర్ పేట్, ఎస్సార్ నగర్ ఇలా కొన్ని ప్రాంతాల్లోని హాస్టళ్లను సైతం టాస్క్ ఫోర్స్ అధికారులు తనిఖీలు చేశారు. కిచెన్లలో అపరిశుభ్ర పరిస్థితులను గమనించిన ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యే మహిపాల్ ఇంట్లో ఈడీ సోదాలు

## - గనుల వ్యవహారంలో నమోదైన కేసుపై



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బీఆర్ఎస్ నేత, పటాన్ చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఇంట్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు నిర్వహించింది. గురువారం ఉదయం 5 గంటల నుంచి పటాన్ చెరులోని ఆయన నివాసంలో ఈడీ అధికారులు సోదాలు చేస్తున్నారు. ఆయన సోదరుడు మధుసూదన్ రెడ్డి నివాసంలోనూ తనిఖీలు నిర్వహిస్తున్నారు. పటాన్ చెరులోని 3 ప్రాంతాలతో పాటు నిజాంపేటలోని మహిపాల్ రెడ్డి బంధువుల నివాసాల్లోనూ సోదాలు చేస్తున్నారు. గతంలో లగ్దారం గనుల వ్యవహారంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ వ్యవహారంలో మహిపాల్ రెడ్డితో పాటు ఆయన సోదరుడు మధుసూదన్ రెడ్డిపైనా కేసు నమోదైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఈడీ అధికారులు సోదాలు చేపట్టినట్లు తెలుస్తోంది. బినామీ పేర్లతో మైనింగ్ వ్యాపారాలు చేస్తున్నట్లు గుర్తించారు. రియల్ ఎస్టేట్స్ వ్యాపారంలో బినామీ పేర్లతో పెట్టుబడి పెట్టినట్లు ఈడీ అధికారులు పేర్కొంటున్నారు.

# వందేభారత్ రైలు భోజనంలో బొద్దింక

## - స్పందించిన రైల్వే శాఖ



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** మరోసారి వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ముఖ్యాంశాల్లో నిలిచింది. గతంలో కూడా చాలా సార్లు ఈ రైలులో వడ్డించిన భోజనం వాసన రావడం, బొద్దింకలు, ఇతర కీటకాలు రావడంపై రైల్వే శాఖ ప్రయాణికుల నుంచి తీవ్ర విమర్శలను ఎదుర్కొంది. తాజాగా మరోసారి ఇలాంటి ఘటన చోటు చేసుకుంది. వాస్తవానికి సాధారణ రైళ్లతో పోలిస్తే వందే భారత్ రైళ్ల స్పీడ్ ఎక్కువ. కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఈ సెమీహైస్పీడ్ వందే భారత్ సర్వీసును తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ రైలు టికెట్ ధర కాస్త ఎక్కువ అయినా చాలా మంది దీనిలోనే ప్రయాణించేందుకు ఆసక్తి చూపుతున్నారు. తొందరగా తమ గమ్యస్థానాలకు చేరుకోవడమే కాకుండా ప్రయాణం సౌకర్యంగా ఉండడమే ఇందుకు కారణం. కానీ, వందే భారత్ రైళ్లలోని భోజన సదుపాయాలపై తరచూ ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా వందేభారత్‌లో ప్రయాణించిన దంపతులకు చేదు అనుభవం ఎదురైంది.

**- సోషల్ మీడియాలో పోస్ట్**

జూన్ 18న భోపాల్ నుంచి ఆగ్రాకు వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న దంపతులకు ఆహారంలో బొద్దింక కనిపించింది. ఈ ఆహారాన్ని రైలులో ఐఆర్‌సీటీసీ అందించింది. వడ్డించిన ఆహారంలో చనిపోయిన బొద్దింక ఉన్న చిత్రాన్ని ట్విటర్ యూజర్ విదిత్ వర్షిణే షేర్ చేశారు. తన అత్త మేనమామలకు రైలులో ప్రయాణిస్తుండగా ఈ సంఘటన ఎదురైందని ఆయన పేర్కొన్నారు. భోజన సౌకర్యాన్ని అందించిన సదరు వ్యాపారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విదిత్ వర్షిణే అధికారులను డిమాండ్ చేశారు. ఐఆర్‌సీటీసీ అతడి పోస్ట్ కు స్పందించి కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు చెప్పింది. సర్వీస్ ప్రొవైడర్లకు తగిన జరిమానా విధిస్తున్నట్లు పేర్కొంది

# బీఆర్ఎస్‌లో పార్టీ ఫిరాయింపుల అలజడి

## - ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ ఆకర్ష్

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** భారత రాష్ట్ర సమితిలో అంతర్గతంగా అలజడి రేగుతోంది. పలువురు పార్టీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారన్న ప్రచారం జరుగుతూండటమే దీనికి కారణం. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక సీట్లలో డిపాజిట్లు కూడా కోల్పోవడంతో చాలా మంది నేతలు రాజకీయ భవిష్యత్ పై ఆందోళన చెందుతున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ నుంచి వారిపై ఒత్తిడి వస్తోంది. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ప్రయోగించిన ఆకర్ష్ తరహాలోనే ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై ఆకర్ష్ అస్త్రం ప్రయోగిస్తున్నారు. ఇప్పటికే ముగ్గురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరారు. ఓ బీఆర్ఎస్ ఎమ్మెల్యే చనిపోవడంతో వచ్చిన ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించారు.

**- కాంగ్రెస్‌తో పలువురు ఎమ్మెల్యేల చర్చలు.?**

ప్రస్తుతం 35 మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో ఉన్నారు. వీరిలో కనీసం ఇరవై మందిని పార్టీలో చేర్చుకోవాలని కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా పెట్టుకుంది. నిజానికి పార్టీ ఫిరాయింపులపై పార్లమెంట్ ఎన్నికల కంటే ముందు నుంచే ఊహాగానాలు వస్తున్నాయి. కొంత మంది ఎమ్మెల్యేలు సీఎం రేవంత్ రెడ్డితో సమావేశం అయ్యారు. వారంతా కాంగ్రెస్ చేరికలను ఖండించారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే చేరిపోవడానికి రెడీ అయినా చివరి క్షణంలో ఆగిపోయారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలను బట్టి నిర్ణయం తీసుకోవాలనుకున్నారు. ఇప్పుడు వారందరితో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం మరోసారి చర్చించి చేరికలకు రంగం సిద్ధం చేసుకున్నట్లుగా చెబుతున్నారు.

**- పిలిచి మాట్లాడుతున్న కేసీఆర్**


ఎవరెవరు కాంగ్రెస్‌లో చేరుతారో స్పష్టత రావడంతో బీఆర్ఎస్ హైకమాండ్ వారిని బుజ్జగించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. కొద్ది రోజుల కిందట నలుగురు ఎమ్మెల్యేలను కేసీఆర్ ఫామ్ హౌస్‌కు పిలిపించుకుని మాట్లాడారు. వారితో దిగిన ఫోటోను విడుదల చేశారు. వారు పార్టీ మారుతారని తెలియడంతోనే పిలిచి మాట్లాడారని అంటున్నారు. అలాగే గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి కూడా పార్టీ మారబోతున్నారని అంటున్నారు. ఆయనను చేర్చుకోవద్దని కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన సరితా తిరుపతయ్య పోరాడుతున్నారు . కానీ ఆమెకు అభయం లభించలేదని తెలుస్తోంది.

**- కేసీఆర్‌కు ప్రతిపక్ష నేత హెూదా లేకుండా చేస్తారా.?**

అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరవ్వాలని అనుకుంటున్నారు. అంతకు ముందే ఆయనకు ప్రతిపక్ష నేత హెూదా పోయేలా చేయాలని కాంగ్రెస్ వ్యూహాత్మకంగా ప్రయత్నిస్తోందని చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీనే కాదు బీజేపీ కూడా ఎమ్మెల్యేలను ఆకర్షించే ప్రయత్నంలో ఉందని చెబుతున్నారు. ప్రధాన ప్రతిపక్షంగా తామే వ్యవహరించాలని బీజేపీ అనుకుంటోంది. రాష్ట్రంలో రాజకీయ భవిష్యత్ బీజేపీకే ఉంటుందన్న ఉద్దేశంతో కొంత మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బీజేపీ వైపే చూస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామాలతో తమ పార్టీ నేతల్ని ఆపడం బీఆర్ఎస్ అగ్రనాయకత్వానికి తలకు మించిన భారం అవుతోంది.

# రైలు బోగీల్లో మంటలు

## - పొగ కమ్మేయడంతో స్థానికుల ఆందోళన



**సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్)** సికింద్రాబాద్ మెట్టుగూడ వద్ద గురువారం ఉదయం రెండు రైలు బోగీల్లో మంటలు చెలరేగాయి. ఆలుగడ్డ బావి వద్ద ఆగి ఉన్న స్పేర్ కోచ్‌ల్లో ఒక్కసారిగా మంటలు రాగా చుట్టూ పొగలు అలుముకున్నాయి. దీంతో ఏం జరుగుతుందో అర్థం కాక స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. నిలిచి ఉన్న బోగీల నుంచి మంటలు వస్తున్నట్లు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, రైల్వే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. వాషింగ్‌కు వెళ్లి ప్లాట్ ఫాంపైకి వస్తున్న అదనపు ఏసీ బోగీల్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించినట్లు గుర్తించారు. ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై దక్షిణ మధ్య రైల్వే జీఎం ఆరా తీశారు. అయితే, బోగీల్లో షార్ట్ సర్క్యూట్‌కు గల కారణాలేంటి అనే దానిపై విచారణ చేస్తున్నారు. బోగీలో మంటలు చెలరేగిన ముందు క్లీనింగ్ సిబ్బంది ఎవరు ఉన్నారనే దానిపై ఆరా తీస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# తహసిల్దార్, గిర్దవర్, రికార్డు అసిస్టెంట్ లు సస్పెండ్

**- మారేడుపల్లి ఎమ్మార్వో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**

**- విధులు సక్రమంగా నిర్వహించకుంటే చర్యలు తప్పవు**

**తార్నాక (ప్రశ్న న్యూస్)** ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హెచ్చరించారు. గురువారం మారేడుపల్లి ఎమ్మార్వో కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్లక్ష్యం వహిస్తూ సక్రమంగా విధులు నిర్వహించని కారణంగా మారేడుపల్లి తహసీల్దార్ పద్మ సుందరి, గిర్ధవర్ పి.ప్రసన్న లక్ష్మి, రికార్డ్ అసిస్టెంట్ ఎస్ రవి లను విధులనుండి సస్పెండ్ చేశారు. కార్యాలయంలోని అన్ని రకాల రిజిస్టర్లలను ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి ఎవరు ఎక్కడికి వెళ్లారని వాకబు చేశారు. ఇన్వర్డ్ రిజిస్టర్ను పరిశీలించి ప్రతి దరఖాస్తును ఇన్వర్డ్ చేసి దరఖాస్తుపై డేట్ స్టాంప్ వేసి సంబంధిత సెక్షన్ కు అందజేయాలని ఆదేశించారు. సంబంధిత సెక్షన్లు బాధ్యతగా, జవాబుదారితనంగా పనిచేసి దరఖాస్తులను పెండింగ్ లో లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. అన్ని రిజిస్టర్ లను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని సూచించారు. విధులు, రికార్డులు సక్రమంగా నిర్వహించని ఉద్యోగులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తాహసిల్దార్ కార్యాలయ స్థాయి, ప్రజావాణి, ప్రజా దర్బార్, లోకయుక్త, హ్యూమన్ రైట్ కమీషన్, కోర్టు కేసుల రిజిస్టర్ల నిర్వహణతో పాటు నివేదికలను నిర్దేశించిన లక్ష్యం లోగా డిస్పోస్ చేయాలని



కలెక్టర్ ఆదేశించారు. తనిఖీల్లో ఆయన వెంట సికింద్రాబాద్ ఆర్డీవో దశరథ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588